# లార్డ్ ఆఫ్ లైఫ్ మినిస్ట్రీస్

పోస్ట్ బాక్స్ నెం. 200, ఫైర్ ఫాక్స్. బీ.ఏ. 22031.


## గొఱ్ఱెపిల్ల వివాహము (Marriage Of The Lamb)


By Joyce Morris 40/07/1991

జాయిస్ మోరిస్


గొఱ్ఱెపిల్ల వివాహమును గూర్చి మీతో పంచుకోవాలనే భారమును దేవుడు నా హృదయమందు ఉంచియున్నాడు. గొఱ్ఱెపిల్ల వివాహమును గూర్చి, వివాహ విందును గూర్చి మరియు అనేక ఇతర విషయములను గూర్చి గొఱ్ఱెపిల్ల వివాహము యొక్క ప్రాముఖ్యత మరియు దాని భావమును గూర్చి మనము ధ్యానించ బోవుచున్నాము.

ఈ సృష్టిలో దేవుడు వివాహవ్యవస్థను నిర్మించి, మరియు ఆత్మీయ విషయములను అర్థం చేసుకొనుటకు సృష్టి నుండి అనేక ఉదాహరణలను ఆయన ఇచ్చిన విదానమును చూడబోవుచున్నాము. వివాహమన్నది ఇద్దరి వ్యక్తుల కలయిక మరియు సంపూర్ణ ఏకత్వము ద్వారా అత్యంత సన్నిహితులుగా ఉండుట. ఈ ప్రక్రియ క్రీస్తు ద్వారా తండ్రియందు ఇద్దరు ఏకమగుట.

దేవుని కుమారులు గొఱ్ఱెపిల్ల ద్వారా సంపూర్ణ ఏకత్వము అనే స్థానానికి తీసుకొని రాబడుచున్నారు. దైవకుమారునితో ఏకత్వము కలిగియుండుట ద్వారా గొఱ్ఱెపిల్ల వివాహమునకు పిలువబడి యున్నాము. మరియు ఒకరికొకరము ఆయనతో సంపూర్ణ ఏకత్వము కలిగి ఉండే స్థానమునకు మనలను తీసుకొని వచ్చుచున్నాడు. మనలో ఒకరినొకరము ఆయనలో వివాహము చేసుకొనే స్థానమునకు మనలను తీసుకొని వస్తున్నాడు. నేను సహజసిద్ధమైన వివాహమును గూర్చిగాక ఆత్మలోఏకత్వము కలిగియుండుట అనే వివాహమును గూర్చి మాట్లాడుచున్నాను.

గొఱ్ఱెపిల్లతో వివాహము, కుమారులతో వివాహము, సంఘముతో వివాహము, చివరిగా ప్రపంచముతో వివాహము (గొఱ్ఱెపిల్ల ద్వారా ఈ సృష్టి అంతా తండ్రితో ఏకత్వము కలిగి యుండుట). వివాహము పరిధి అంతకంతకు పెరుగుతూ ఉంటుంది. ప్రస్తుతదినాలలో మన జీవితములో దేవుడు చేయుచున్న క్రియను బట్టి మరియు దేనికొరకు ఆయనతో ఏకత్వము కలిగియుండి యున్నామో దానిని గురించిన ఆనంద ఉత్సాహమును కలిగియున్నాను.

ఈ వ్యాసము పూర్తియుగు న మయమునకు గొఱ్ఱెపిల్ల అనగానేమి అనే దానిని, సంఘటనల క్రమమును మరియు పైవన్నిటిని దేవుడు జరిగించే విధానమును అర్థం చేసుకొనవచ్చు. వివాహవ్యవస్థను దేవుడే సృష్టించాడు అనియు మరియు ఆయన దానిని చేయుటకు గల కారణాన్ని మనము ధ్యానించబోవుచున్నాము.

ఆదిలో ఆదాములోనుండి దేవుడు స్త్రీని మరియు పురుషునిగాను సృజించెను. ఒక ప్రత్యేకమైన ఉద్దేశ్యము కొరకు వారిద్దరు కలిసి ఉండాలని వారిని జతకూర్చాడు. కారణం ఏమిటంటే తండ్రి తనలాంటి వ్యక్తిని సృష్టించవలెనంటే ఒక స్త్రీ అవసరమని ఆయనకు తెలుసు.

స్త్రీ అనేది మనస్సు అని , దేవుడు తనను తాను పునరుత్పత్తి చేసుకోగలిగిన స్థానం ఆ మనస్సేనని గతంలో చెప్పుకొని యున్నాము. దేవుడు మన మనస్సును పురికొల్పుటకు మరియు ఆయనకు సమీపస్తులుగా చేసుకొనుటకు గల కారణం ఆయన మన మనస్సును (పెండ్లికుమార్తె) శుద్ధిచేసి మరియు ఆయనతో ఏకత్వము కలిగియుండుటకు సృష్టింపబడియున్నాము. ఈ ఏకత్వము ద్వారా క్రీస్తు / మనుష్యకుమారుడు / దేవుని కుమారులలో ఈ సృష్టి అంతా తండ్రిని చూచునట్లుగా సృష్టింపబడియున్నాము. ఆయన మహిమను ఈ భూమిమీద కనుపరచుట కొరకే వివాహవ్యవస్థ అనే దానిని దేవుడు సృష్టించియున్నాడు.

ఈలోక సంబంధమైన మరియు ఆత్మీయ సంబంధమైన వివాహములు అనేవి రెండు ఉన్నవని మనకు తెలియును. కొందరు ఈలోక సంబంధ వివాహితులని, మరికొందరు ఒంటరిగానే ఉన్నారని మనకు తెలియును. కాని ఎవరు కూడా ఒంటరివారుగా ఉండరు. ఒంటరివారు కూడా భర్తను కలిగియున్నారు కారణం ప్రతివ్యక్తీ వివాహితుడైనను లేక ఒంటరివారుగా ఉన్నను క్రీస్తుతో వివాహము చేయబడుదురు.

క్రీస్తు మన ప్రతి అవసరమును ప్రతి సమయములోను తీర్చు నమ్మకమైన భర్తయై యున్నాడు. గనుక మనలో ప్రతిఒక్కరు కూడా క్రీస్తుతో ఏకత్వమును కలిగి నడువవలెను.

మత్తయి 22:2 లో యేసు చెప్పిన ఆసక్తికరమైన విషయం ఏమిటంటే పరలోక

రాజ్యము తన కుమారునికి పెండ్లివిందు చేసిన ఒక రాజును పోలియున్నది. దేవుడు తన కుమారుని వివాహము అనేక ప్రత్యేక కారణముల నిమిత్తము తన రాజ్యమును సిద్ధపరచియున్నాడు. ఈలోకములో వున్న ప్రతిఒక్కరు ఈభూమికి పునాది వేయబడక మునుపు ఉన్న స్థానమునకు తిరిగివచ్చి ఆయనతో సమాధానపడాలని ఈ సృష్టి పట్ల దేవుని ప్రణాళిక. ప్రతివ్యక్తి దేవుని యొద్దకు తిరిగివచ్చినప్పుడు ఈ సృష్టి అంతటికి గొఱ్ఱెపిల్లతో వివాహము జరుగును. ఈ సృష్టి అంతయు ఆయనతో మరియు ఆయనలో ఏకత్వమును కలిగియుండును. మరియు ఒకరితో ఒకరము ఏకత్వము కలిగియుందుము. అక్కడ శతృత్వముగాని లేక జగడములు గాని ఉండవు. ఈ సృష్టి అంతయు దేవుని స్వభావమును ప్రతిబింబించును. 1కొరింథి 15:28. **మరియు సమస్తమును ఆయునకు లోబరచబడినప్పుడు దేవుడు సర్వములో సర్వమగు నిమిత్తము కుమారుడు తనకు సమస్తము లోబరచిన దేవునికి తానే లోబడును.**

యేసు సిలువను అనుభవించుట ద్వారా దేవుని వాక్యమును నెరవేర్చి మరియు మానవుని పాపములకు ప్రాయశ్చిత్తము చేయుట ద్వారా వివాహోత్సవములో పాల్గొని తిరిగి దేవునితో ఐక్యత కలిగియుందుము. పాపము మానవుని దేవుని నుండి దూరపరచినది. కాని ప్రాయశ్చిత్తము అను మాటకు అర్ధము చేసిన తప్పునకు సమాధానమైన శిక్షను అనుభవించుట. క్రీస్తు జీవితము మరియు మరణము ద్వారా దేవుడు మరియు మానవుడు సమాధానపడుట. కొలస్సీ 10:20,21. **''ఆయునయందు సర్వసంపూర్ణత నివసింపవలెననియు ఆయున సిలువ రక్తముచేత సంధిచేసి ఆయున ద్వారా సమస్తమును అవి భూలోకమందున్నవైనను, పరలోకమం దున్నవైనను వాటినన్నిటిని ఆయన ద్వారా తనతో సమాధానపరచుకొనవలెనని తండ్రి అభీష్టమాయెను.**

వేరొక మాటలో చెప్పవలెనంటే యేసు సిలువ శ్రమను అనుభవించి రక్తము చిందించుట ద్వారా ఈ సృష్టినంతటిని తండ్రితో సమాధానపరచి భూమి పునాదులకు ముందు తండ్రితో వున్న ఏకత్వమును తిరిగి పెంపొందింపచేయుట. గొఱ్ఱెపిల్ల వివాహము అనగా ఇదియే. అనగా ఆయన కుమారుని ద్వారా ఆయన కుమారునియందు అన్నివిషయములు ఏకము చేయుట ద్వారా దేవుని ప్రణాళిక నెరవేర్పు జరుగును.

కొన్ని దినముల క్రితము ఆత్మలో నింపబడియున్నప్పుడు సియోను పర్వతముపై గొఱ్ఱెపిల్ల, ఆయన ప్రక్క నుండి రక్తము కారుటను చూపించినాడు. చీకటిలో ఉండి క్రీస్తు ప్రేమకు ఉత్తేజితులు కాని వారి కొరకు ఆయన చేతిని చాచి వారికి పరిచర్య చేయుటకు సిద్ధముగా ఉన్నాడు అనుటకు ఆయన రక్తధార ప్రవహించుట ఒక సాదృశ్యముగా ఉన్నది. అందరు తిరిగి తండ్రితో సమాధాన పరచవలెనని దాని ద్వారా అందరు వివాహమునకు వచ్చి గొఱ్ఱెపిల్లతో ఏకము కావలెనని కోరుచున్నాడు.

ఈ వివాహము అనేది నిత్యము ఉండే విందు. అదే దేవుని రాజ్యము. నీతియు, సమాధానము మరియు పరిశుద్ధాత్మనందలి ఆనందము అనబడే విందు. ఈ విందుయే ప్రేమ. ఇదిఎప్పటికిని అంతముకాని విందు. దానిలో సృష్టి అంతయు నిరవధికముగా ఆత్మఫలములు అనుభవిస్తూ ఉండును.

వివాహము అనేది భవిష్యత్తులో జరిగే ఏదో ఒక సంఘటన కాదుగాని తండ్రి దీని గురించి తెలుసుకొనుటకు ఇప్పుడు మనలను పిలుచుచున్నాడు. మనము లోనికి వచ్చి సమన్వయముతో ఆయనతో కలిసి ఏకత్వము కలిగియుండుటకును కోరుచున్నాడు. మనము ఆత్మఫలములు భుజిస్తూ , ఆయన ఆనందమును, ఆయన సమాధానమును, ఆయన పునరుత్థాన జీవమును మరియు ఆయన ప్రేమను అనుభవిస్తూ ఉంటాము. ఆయన ఏమైయున్నాడో అలాగుననే మనము కూడా మార్పు చెందుతూ గొఱ్ఱెపిల్ల విందులో పాల్గొందుము. ఆయన కుమారుల ద్వారాను, తండ్రి తనను తాను వివిధ స్థాయిలలో సృష్టించుకొనుచుండెను. కాని తన పూర్ణమహిమలో అనగా తనను గూర్చి మరియు సృష్టి యెడల తన ప్రేమను గూర్చి ప్రకటించుటకు ఆయన ప్రత్యక్షము కాబోవుచున్నాడు. తనను ప్రేమించే ప్రజలు తనయొద్దకు రావలెనని పురిగొల్పుచున్నాడు. ఈ ప్రజలు ఆయనను మహిమ పరచుటకు ఆయన రూపములోని ఆయన పోలిక చొప్పున చేయబడియున్నారు.

ప్రకటన గ్రంథం 14వ అధ్యాయంలో ఈవిధంగా వ్రాయబడినది. పదునాలుగు అనగా రెట్టింపు పరిపూర్ణత అని అర్ధము. గొఱ్ఱెపిల్ల సియోను పర్వతముపై నిలిచియుండి మరియు తండ్రి నామము వారి నొసళ్ళమీద లిఖింపబడిన ప్రజలు ఆయునతో నిలిచియున్నారు. ప్రకటన 14:1. **“మరియు నేను చూడగా ఇదిగో గొఱ్ఱెపిల్ల సియోను పర్వతముమీద నిలువబడి యుండెను. ఆయున నామమును ఆయున తండ్రి నామమును నొనళ్లయందు లిఖిం పబడియున్న నూటనలుబది నాలుగువేల మంది ఆయునతో కూడా ఉండిరి”.** (నూట నలుబదినాలుగు అనగా ఆత్మ

సహాయముతో నడిచే జీవితము, జయించే ప్రజలు) "వేయి" అనగా దేవుని మహిమ మరియు ఆయన సంపూర్ణత్వము. మరొకమాటలో క్రీస్తు ద్వారా సమస్తమైన వాటిని జయించి దేవుని సంపూర్ణత యందును, మరియు మహిమను కలిగిన ప్రజలను గూర్చి చెపబడింది. గొఱ్ఱెపిల్ల ద్వారా వారు తండ్రితో ఏకమై యున్నారు. "తండ్రి నామము వారి నొసళ్ళయందు లిఖింపబడి" ఉండుట అనగా క్రీస్తు మనసులోనికి వారి మనస్సులు రూపాంతరము చెందియున్నవి.

దేవుడు తన నామమును నీ నొసలునందు ఏవిధముగా లిఖింపగలడు? ఆయన వాక్యమును మరియు ఆత్మ మీ మనస్సునందు చొచ్చుకొని తీర్పుతీర్చి సరిచేసి మరియు ఆయన స్వభావము కలిగియుండని ప్రతిదానిని దహించివేయుట ద్వారా దీని చేయగలడు. ఆయన వాక్యము మరియు ఆత్మ ద్వారా నీ మనస్సును నూతనపరచి క్రీస్తు మనస్సువలె ఉండుటకు దానిని పూర్వపు స్థితికి మార్చును. భూమి పునాదులు వేయబడకమునుపు ఆయనలో నీ మనస్సు ఉన్న స్థితికి నిన్ను తీసుకొని వచ్చును. నీవు ఎవరివో నీకు జ్ఞాపకము చేసి, నీ మనస్సును రూపాంతరము చెందించుట ద్వారా నీ స్వభావము మార్చి (అనగా నీ మాట, ఆలోచన మరియు క్రియ) గొఱ్ఱెపిల్లగా మారుటకు నిన్ను పురిగొల్పుచున్నాడు. ఆయన ఉన్నట్టుగా నీవు మారి మరియు ఆయన యొద్దకు వచ్చునప్పుడు తండ్రితో ఏకత్వమును కలిగియుందువు. మరి యేదియు (పాపముగాని, ఆలోచనగాని) తండ్రి ప్రేమ నుండి నిన్ను వేరు చేయనేరవు.

రోమా 12:12లో **"మీరు ఈలోక మార్యాదను అనుసరింపక ఉత్తమమును, అనుకూలవమును, సంపూర్ణమైయున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలుసుకొనునట్లు మీ మనస్సు మారి నూతనమగుట వలన రూపాంతరము పొందుడి"** అని పౌలు వ్రాసియున్నాడు. ఎఫెసీ 4:23,24 నందు **"మీ చిత్తవృత్తియందు నూతన పరచబడినవారై నీతియు, యథార్థమైన భక్తియు గలవారై దేవుని పోలికగా సృష్టింపబడిన నవీన స్వభావమును ధరించుకొనవలెనని** వ్రాయబడియున్నది. కొలస్సీ 3:10 నందు **"జ్ఞానము కలుగునిమిత్తము దాని సృష్టించినవాని పోలికచొప్పున నూతనపరచబడుచున్న నవీన స్వభావమును ధరించుకొని యున్నారు"**

పైన చెప్పబడిన వాక్యములన్నియు పౌలు చెప్పుటకు గల కారణం దేవుని కుమారులైనవారి మనస్సు నూతన పర్చబడి క్రీస్తు మనసువలె రూపాంతరము చెందబడి యున్నారని ఆయన గ్రహించినాడు. మనము నూతన స్వభావమును అనగా దేవుని స్వభావమును ధరించుకొనవలసి ఉందని పౌలు తెలుసుకొనియున్నాడు. యేసు అనేకమంది సహోదరులలో జ్యేష్టుడుగా దేవుని పోలిన చొప్పున దేవుని రూపములో వచ్చిన వాడని పౌలు గ్రహించాడు. రోమా 8:29 నందు పౌలు ఇలాగు వ్రాయుచున్నాడు. **ఎందుకనగా తన కుమారుడు అనేక సహోదరులలో జ్యేష్టుడగునట్లు దేవుడు ఎవరిని ముందుగా ఎరిగెనో వారు తన కుమారునితో స్వారూప్యము గలవారగుటకు వారిని ముందుగా నిర్ణయించెను.**. ప్రకటన 14వ అధ్యాయములో ఉన్నట్లే పౌలు అర్థం చేసుకున్నాడు. దేవుడు తన సమయమునందు గొఱ్ఱెపిల్ల వంటి స్వభావము గల ప్రజలను కలిగియుడును.

ప్రకటన 14:2-5 నందు **"మరియు విస్తారమైన జనముల ధ్వనితోను, గొప్ప ఉరుము ధ్వనితోను సమానమైన ఒక శబ్దము పరలోకములో నుండి రాగా వింటిని. నేను విన్న ఆ శబ్దము వీణలు వాయించుచున్న వారిని పోలియున్నది. వారు సింహాసనము ఎదుటను, ఆ నాలుగు జీవుల యెదుటను, పెద్దల యెదుటను ఒక క్రొత్తకీర్తన పాడుచున్నారు. భూలోకములో నుండి కొనబడిన ఆ నూట నలువది నాలుగువేల మంది తప్ప మరి ఎవరును ఆ కీర్తనను నేర్చుకొనజాలరు"** అని వ్రాయబడి యున్నది. **"వారు భూలోకము నుండి కొనబడిన వారు"** అని వ్రాయబడినది. అనగా ఈలోక సంబంధమైన అవినీతి నుండి విడిపింపబడి ప్రత్యేకింపబడినవారు. వీరు గొఱ్ఱెపిల్ల రక్తము ద్వారా ప్రతిదానిని జయించి వీరి పాప నియమములకు మరియు మరణమునకు దాసులు ఎన్నటికిని కారు. ఒకప్పుడు వారు ఆదాము స్వరూపము అనగా భూసంబంధమైన రూపమును కలిగియుండి ఇప్పుడు రెండవ ఆదాము అనగా పరలోకము నుండి వచ్చిన ప్రభువు (గొఱ్ఱెపిల్ల) రూపమును కలిగియున్నారు.

**"వీరు స్త్రీ సాంగత్యమున అపవిత్రులు కానివారు"** (వారు స్వచిత్తమునకు గాని, వారు మనస్సునకు గాని ఏవిధమైన సంబంధములు మరియు లోబడియుండుటకు గాని ఇష్టపడలేదు) **వారు కన్యత్వము కలిగినవారు.** (దేవుని స్వభావము కానిదేదియు వారిలో నిలిచియుండలేదు. వారి మనస్సులు నూతనపరచబడి పవిత్రముగా నిలిచి యున్నవి. దేవుని దృష్టిలో వారు మచ్చలేనివారుగాను లేక నిందారహితులుగాను ఉండి గొఱ్ఱెపిల్లతో సహవాసము ద్వారాను, మరియు వివాహము ద్వారాను సంపూర్ణ సమర్పణ కలిగియున్నారు). **వీరు స్త్రీ సాంగత్యము ఎరుగనివారై యుండి**

**<u>గొఱ్ఱెపిల్ల ఎక్కడికి పోవునో అక్కడికెల్లా ఆయనను వెంబడింతురు. వీరు దేవుని కొరకు, గొఱ్ఱెపిల్ల కొరకు ప్రథమ ఫలముగా ఉండుటకై మనుష్యులలో నుండి కొనబడినవారు. వీరినోట ఏ అబద్ధము కనబడలేదు. వీరు అనింద్యులు.</u>** గొఱ్ఱెపిల్లతో జరుగవలసిన వివాహము ఒక క్రమపద్ధతిలో ఉన్నదని దానిని గూర్చిన దృశ్యము తండ్రియైన దేవుడు నాకు చూపించియున్నాడు. "నా కుమారులు గొఱ్ఱెపిల్లగాఉండాలి "అని దేవుడు నాతో స్పష్టముగా మాట్లాడిరి.

గొఱ్ఱెపిల్లగా మారాలి అంటే మొదట గొఱ్ఱెపిల్లను వివాహం చేసుకొని ఆయనతో ఏకత్వమును కలిగి యుండాలి. దేవుడు నీ మనస్సును ఆవరించి ఆయనతో ఏకత్వమును కలిగి యుండుట వలన నీవు గొఱ్ఱెపిల్లగా మారగలవు.

నీవు గొఱ్ఱెపిల్లగా మారుటకు గొఱ్ఱెపిల్ల యొక్క శరీర భాగములన్నిటిని భుజించవలసి యున్నది. పస్కా పండుగ సమయంలో ఇశ్రాయేలీయులు గొఱ్ఱెపిల్ల యొక్క ఏ భాగమును విడువకుండా భుజించినవిధంగా మనమును భుజించవలెను. వెనుకవైపు అవయములు, తలభాగము, లోపలి అవయవములు మరియు గొఱ్ఱెపిల్ల యొక్క అసాధారణ వయములను భుజించవలెను. మరియొక మాటలో చెప్పవలెనంటే నీవు వాక్యమును భుజించాలి. ఆ వాక్యమే గొఱ్ఱెపిల్ల.

యోహాను 1:4లో ఈలాగు చెప్పబడినది. **"ఆ వాక్యమే శరీరధారియై మనమధ్య నివసించెను...."** మరియు యోహాను 6:53-58 మరియు 63నందు ''కావున యేసు ఇట్లనెను- **మీరు మనుష్యకుమారుని శరీరమును తిని, ఆయన రక్తమును త్రాగితేనేగాని, మీలో మీరు జీవముగలవారు కారు. నా శరీరమును తిని, నా రక్తము త్రాగువాడే నిత్యజీవము గలవాడు, అంత్యదినమున నేను వానిని లేపుదును. నా శరీరము నిజమైన ఆహారమును నా రక్తము నిజమైన పానమునై యున్నది. నా శరీరము తిని నా రక్తము త్రాగువాడు నాయందును, నేను వానియందును నిలిచియుందుము. జీవముగల తండ్రి నన్ను పంపెను. గనుక నేను తండ్రి మూలముగా జీవింతును.**

ప్రకటన 14:4నందు **"…. గొఱ్ఱెపిల్ల ఎక్కడికి పోవునో అక్కడికెల్ల ఆయనను వెంబడింతురు"** (అనగా వారు వాక్యము ద్వారా జీవింతురు) ఇది పరలోకము నుండి దిగివచ్చిన ఆహారము. పితరులు మన్నాను తినియు చనిపోయినట్టు కాదు. ఈ ఆహారము తినువాడు ఎల్లప్పుడును జీవించునని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. ఆత్మయే జీవింప చేయుచున్నది. శరీరము కేవలము నిష్ప్రయోజనము. నేను మీతో చెప్పుచున్న మాటలు ఆత్మయు జీవమునై యున్నవి".

కాని వాక్యములో వున్న చాలా భాగములను నీ శరీరము భుజించుటకు ఇష్టపడు. ఈ భాగములు నా కొరకు కాదు అక్కడ ఉన్నవారి కొరకు అని నీ స్వచిత్తము నీతో చెప్పును. వాక్యప్రకారం నేను నడువవలసిన అవసరం లేదు. నేను దానిని భుజించవలసిన అవసరం లేదు. నాకు ఇష్టమైనది నేను చేస్తాను, నాకిష్టమైనది మాట్లాడతాను. నాకిష్టమైన విధంగా మాట్లాడతాను. నాకిష్టమైనవిధంగా ఆలోచిస్తాను. నేను ఏమి చెయ్యాలో, ఏమి చెయ్యకూడదో ఎవ్వరూ నాకు చెప్పవలసిన అవసరం లేదు. ఫలానా వ్యక్తిని నేను ప్రేమించవలసిన అవసరం లేదు. ఫలానావ్యక్తిని క్షమించవలసిన అవసరం లేదు. దేవుడు నా జీవితములో ఈ భాగమును నీకు ఇస్తాను, కాని ఆ భాగమును నాకొరకు ప్రత్యేకించుకోవాలని ఆశించుచున్నాడు. కారణమేమంటే, వాక్యములోని అనేక భాగములు శరీరమునకు అసాధారణ ముగాను, సంతోషపరచలే నివిగాను ఉన్నవి. మరియు ఒకవేళ భుజించి జీర్ణము చేసుకొనినట్లయితే నీ మనస్సు మార్చబడి స్వచిత్తము మరణించి ఉండును.

నీవు గొఱ్ఱెపిల్లను భుజించే కొలది, నీ మనస్సు గొఱ్ఱెపిల్ల స్వాధీనములోనికి వచ్చును. దేవుని పోలిలేని ప్రతిదానిని దేవుడు నీలో నుండి తొలగించినపుడు నీవు గొఱ్ఱెపిల్లవలె మారెదవు. నీవు దేవునితో పూర్తిగా ఏకత్వమును కలగి యుండెదవు. ఆయునతో ఒక స్థలమునకు ప్రవేశించియున్నావు. అనగా బయటకు వెళ్ళనక్కరలేని మరియు నీ జీవితమంతటిలో ప్రతివిషయములో ఆయనే ప్రాముఖ్యమైనవాడుగా ఉండును. ప్రత్యేకమైన దేవాలయం ఉండకపోవుటకు కారణం దేవుడు ఆ గృహమును తన మహిమతో నింపెను. **"సర్వశక్తుడైన దేవుడు మరియు గొఱ్ఱెపిల్లయే ఆలయమైయున్నారు".**

ఈ కారణంచేత దేవుడు ఇశ్రాయేలీయులను ఐగుప్తు దాస్యము నుండి విడిపించునపుడు, కళంకము లేక మచ్చలేని గొఱ్ఱెపిల్లను వధించమని దేవుడు వారితో చెప్పియున్నాడు. వారి ద్వారపు పైకమ్మి మరియు నిలువు కమ్మిలకు గొఱ్ఱెపిల్ల రక్తమును పూయుమని ఆజ్ఞాపించినాడు. (ద్వారము అనేది మనస్సుకు సాదృశ్యముగా ఉన్నది). అది రక్తముతో కప్పబడవలెను. ఎవ్వరును వారి గృహము బయటకు వెళ్ళవలసిన అవసరం లేదు అని దేవుడు చెప్పియున్నాడు. మరియు ఆయన చెప్పినట్లు చేసినచో నాశనపాత్రుడు వారి గృహము

(మనస్సు) లోనికి ప్రవేశించి వారిని నాశనం చేయలేడు. అనగా వారు పంచేంద్రియముల అధ్యాయములోనికి తిరిగి వెళ్ళక ఆత్మతోను మరియు క్రీస్తు మనస్సుతోను నిలిచి ఉండాలి.

తర్వాత గొఱ్ఱెపిల్లను నిప్పులపై కాల్చాలని దేవుడు ఇశ్రాయేలీయులకు చెప్పాడు. అనగా అది దహనబలియై యున్నది. యేసు గొఱ్ఱెపిల్లయై యుండి మనందరికి ఒక మాదిరియై యున్నాడు. హెబ్రీ 12:29 నందు **"కావున మన దేవుడు దహించు అగ్నియై యున్నాడు"** రోమా 12:1,2 పౌలు ఈవిధంగా వ్రాయుచున్నాడు. **"కాబట్టి సహోదరులారా! పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమును బట్టి బ్రతిమాలుకొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది. మీరు ఈలోక మర్యాదను అనుసరింపక ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమైయున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలుసుకొనునట్లు మీ మనస్సు మారి నూతనమగుట వలన రూపాంతరము పొందుడి".**

గొఱ్ఱెపిల్ల యొక్క ప్రతిభాగమును వారు భుజింపవలెనని ఇశ్రాయేలీయులు దేవునిచేత బోధింపబడినారు. వారు గొఱ్ఱెపిల్ల యొక్క అంతర్గత భాగములను, తలను మరియు కాళ్ళను భుజింపవలెను. గొఱ్ఱెపిల్ల యొక్క ఏ భాగమును విడిచిపెట్టకుండా భుజింపవలెనని దేవునిచే ఆజ్ఞాపించబడినారు. ఇవన్నియు దేవుడు వారిని చేయమనిన ప్రయాణము కొరకు చేసుకొనే సిద్ధపాటు. ఈ ప్రయాణము ఐగుప్తు బానిసత్వము నుండి విడిపించుటకు (ఇది శరీరమునకు సాదృశ్యముగా ఉన్నది) మరియు వాగ్దాన దేశములోనికి ప్రవేశపెట్టుటకు (ఇది ఆత్మ లేక దేవుని రాజ్యము లేక గొఱ్ఱెపిల్ల వివాహమునకు సాదృశ్యముగా ఉన్నది). నీతియు, సమాధానమును మరియు ఆనందమునై మరియు పరిపూర్ణమైన ఆయన రాజ్యములోనికి ప్రవేశించవలెనని దేవుడు కోరుచున్నాడు. ఇశ్రాయేలీయులు గొఱ్ఱెపిల్లను వారితో భాగముగా ఉండుటకు అనుమతించలేదు. దేవునిని వారి జీవితములోనికి మరియు వారి మనస్సులను పరివర్తనము చెందుటకు వారు ఆయనను అనుమతించలేదు. విశ్వాసము ద్వారా నడుచుటకు వారు నిరాకరించి, సణుగుకొనుచూ, పిర్యాదు చేయుచూ, పంచ ఇంద్రియములను అనుసరించి నడుచుచూ వచ్చిరి. "ఇశ్రాయేలీయులు దేవుడు తనతో ఏకత్వమును కలిగియుండాలనే స్థితికి వారు చేరలేకపోవడానికి కారణం వారు ఈలోకములో దేవుడు కోరే ఫలములను వారు ఫలించలేకపోవుటే. మరియు వారు దేవునిని విశ్వసించలేకపోవుటను బట్టి వాగ్దాన దేశము (దేవుని రాజ్యము లేక గొఱ్ఱెపిల్ల వివాహము)లో ప్రవేశింపక అరణ్యములో మరణించిరి లేక అంధకారములోనికి త్రోసివేయబడిరి.

గొఱ్ఱెపిల్ల వివాహము అనునది దేవుని కుమారులు (ఈ సృష్టి అంతయు) క్రీస్తుతో ఏకత్వము ద్వారా గొఱ్ఱెపిల్లగా మార్పు చెందుట. (లేక గొఱ్ఱెపిల్ల స్వభావమును ధరించుకొనుట). ఇది అంతయు ఇద్దరు ఏకమగుటను గూర్చి, వారిద్దరు సన్నిహితము అగుచున్న కొలది, అనగా క్రీస్తుతో మన సహవాసము ఒక కుమారుని ఉత్పత్తి చేయును. ప్రకటన 14:4నందు నలుబది నాలుగు వేలు అని చెప్పుటకు కారణం **"గొఱ్ఱెపిల్ల ఎక్కడికి పోవునో అక్కడికెల్లను ఆయనను వెంబడింతురు".** "వారు వేరుచేయబడనివారు, వారందరు ఏకత్వమును కలిగియుందురు".

నీవు ఎటువంటి ఏకత్వమును కలిగియున్నావో దాని ప్రకారం కుమారుని ఉత్పత్తి చేయగలవు. ఒకవేళ నీ మనస్సులో ఏకత్వమును కలిగియుండినచో అప్పుడు శరీర సంబంధమైనది మరేదియు ఉత్పత్తి చేయుట అసాధ్యము. ఒకవేళ నీవు గొఱ్ఱెపిల్లతో ఏకత్వమును కలిగియున్నట్లయితే నీవు ఈ భూమిపై క్రీస్తువుగా ఉండగలవు గాని మరి దేనివలెనూ కాలేవు. కాని చాలామంది ప్రభువతో పేరుకుమాత్రం వివాహము చేయబడాలని కోరుకొనుచుందురు. వారికి ఆయన పేరు కావాలి, ఆయన వల్లవచ్చే ఆశీర్వాదములు, ప్రతిఫలములు కావాలి. కాని వారు ప్రభువుతో ఏవిధమైన ఒడంబడిక చేసుకొని ఆయన స్వభావమును కలిగియుండుటకు ఇష్టపడరు.

చాలా సంవత్సరముల క్రితము జరిగినదానిని నేను చాలా స్పష్టముగా జ్ఞాపకముంచుకొని యున్నాను. సంపూర్ణ సువార్త బిజినెస్ కూటములో వాక్యపరిచర్య చేయుటకు సిద్ధపడుచుండినప్పుడు ఈ విషయమై ప్రభువు బిగ్గరగాను, స్పష్టముగాను నాతో మాట్లాడినారు. నా ప్రజలకు నా పేరు కావాలి గాని వారికి నా పేరువలె మారడానికి ఇష్టము లేదు. వారు నాతో సంబంధమును కలిగియుండుటకు ఇష్టపడుచున్నారు గాని నన్ను వివాహము చేసుకొనుటకు ఇష్టపడరు. కారణం ఒకవేళ నన్ను వివాహము చేసుకొనినచో ఒడంబడిక చేసుకొనవలసి ఉంటుంది గనుక. సహజంగా చాలామంది వివాహము చేసుకొనకుండా ఉండుటకు,

ఇష్టపడుటకు గల కారణం వారు ఒడంబడిక చేసుకొనుటకు నిరాకరించుచున్నారు. వివాహము ద్వారా వచ్చే బాధ్యతను స్వీకరించుటకు ఇష్టపడకపోవుటకు గల కారణం అది ఇద్దరి మధ్య ఒడంబడిక మరియు వారిద్దరి సహవాసములో ప్రతిదినము దానిని నెరవేర్చవలసి ఉంటుంది. నా ప్రజలు ఇదేవిధంగా ఉన్నారని ప్రభువు చెప్పియున్నాడు. నా ప్రజలు నాతో సహవాసము కోరుచున్నారు గాని నన్ను వివాహము చేసుకొనుటకు ఇష్టపడరు. ఇశ్రాయేలు ప్రజలవలె నా ప్రజలు జారత్వమును మరియు వ్యభిచారమును జరిగించుటకు ఇష్టపడుచున్నారు. వారికి ఇతర ప్రేమికులు కావాలి మరియు విగ్రహారాధనను జరిగించుచున్నారు. వారు నాకంటే వారి కుటుంబములను, సంబంధములను, ధనమును, గృహము లను, ఆస్తులను మరియు వ్యాపారములను ఎక్కువగా ప్రేమిం చుచున్నారు. నాకంటే ఎక్కువగా ఈలోక విషయములందు శ్రద్ధ చూపుచున్నారు. వారికి వారి మతములు, సిద్ధాంతములు, ఆచారములు మరియు నమ్మకములు నాకంటే ఎక్కువగా కావాలి. వారి జీవితములో మొదటి స్థానంగాని, నన్ను ప్రభువుగా గాని ఉంచుకొనుటకు ఇష్టపడరు. వారు నా కంటే ఎక్కువగా ఆశీర్వాదములను నా నుండి కోరుచున్నారు. వారికి బహుమతులను ఇచ్చేవారికంటే ఎక్కువగా నానుండి బహుమతులను కోరుచున్నారు. వారికి వారి సేవాపరిచర్యలు, తెలివి మరియు నా నుండి దర్శనములు కోరుచున్నారు గాని వాటితో వచ్చే బాధ్యతను గాని, ఒడంబడిక గాని స్వీకరించుటకు ఇష్టపడరు. వారు నాతో గొఱ్ఱెపిల్ల వివాహమునకు వచ్చుటకు అంగీకరిం చలేకపోవుటకు కారణం నా నుండి వేరుగాను, ప్రత్యేకముగాను ఉండుటకు ఇష్టపడుచున్నారు. క్రీస్తు శరీరములోని చాలామంది సభ్యులు మరియు నా కుమారులైనవారు చాలామంది నా రాజ్యములో ఏకత్వము కలిగి నివసించుటకు బదులు వారి సొంత రాజ్యములను స్థాపించుకొనుటకు సిద్ధపడుచున్నారు. ద్వారములు తెరుచుటకు వారికి నా పేరు కావాలి గాని ఆ ద్వారముతో సహవాసము కలిగి దానిలో ప్రవేశించుటకు ఇష్టపడరు. నా కుమారుని కొరకు ఏర్పాటు చేసిన వివాహమునకు వచ్చుటకు వారికి ఇష్టము లేదు. నేను వారికి పెట్టిన "నా నామమును" కలిగియుండుట అనే బాధ్యతను స్వీకరించుటకు వారికి ఇష్టము లేదు. వారు నాతో ఏకత్వమును కలిగియుండుటకు మనస్సు లేదు.

ఇవి అన్నియు బలమైన వాక్యములు కావచ్చు గాని అవి నిజంగా సత్యమైనవి. క్రీస్తు సంఘములోను మరియు దేవుని కుమారులలోను చాలాకాలము నుండి జరుగుచు ప్రస్తుతము కొనసాగుచున్నది. దేవుని నుండి పెద్ద దర్శనములు, తెలివితేటలు, దానిని గూర్చిన అవగాహన మనకి కావాలి గాని వాటితో వచ్చే బాధ్యతను గాని, ఒడంబడికను గాని స్వీకరించుటకు ఇష్టపడకున్నాము. ఈ వివాహమునకు మనమందరము పిలువబడి యున్నాము. ఈ సహవాసమునకు మరియు గొఱ్ఱెపిల్లతో ఏకత్వమును కలిగియుండుటకు పిలువబడి యున్నాము. మనమందరము గొఱ్ఱెపిల్లవలె అగునట్లు గొఱ్ఱెపిల్ల వివాహ మహోత్సవమునకు పిలువబడియున్నాము. "వివాహమునకు అంతయు సిద్ధముగా ఉన్నదని తెలియజేయాలని రాజు తన సేవకులను పదేపదే పంపించినాడు. ఆహ్వాన పత్రములు పంపబడియున్నవని ఆయన మరలా మరలా మనకు తెలియజెప్పినాడు. **"పిలువబడినవారు అనేకులు గాని ఏర్పరచబడినవారు కొంతమంది"** మాత్రమే అని ఆయన చెప్పాడు.

గొఱ్ఱెపిల్ల వివాహమునకు బాధ్యత మరియు ఒడంబడిక అనే ఈ రెండునూ అవసరము. నీవు మొదట ప్రభువును వివాహము చేసుకొని మరియు నీ జీవితమును ఆయనకు సమర్పించినపుడు, నూతన దంపతులుపొందే అనుభూతిని పొందగలవు. క్రీస్తును నీ జీవితములో ప్రతిదినం అనుభవించగలవు. ఆయన ప్రేమను, సంతోషమును, సమాధానమును నీవు అనుభవించగలవు. ఆయన ప్రేమను సరిపడినంతగా నీవు పొందలేవు గాని ఆయన సన్నిధిలో చిరకాలము ఉండాలని ఆశిస్తావు. అయితే సహజ వివాహ సంబంధంలో జరిగినట్లుగానే ఈ వివాహములో కూడా మొదటి ప్రేమ తరిగిపోయే సమయము వచ్చును.

సహజ వివాహమునందు నీకు కాబోయే భార్యను ప్రేమించుటలో ఎంతో ఆతురతను కలిగియుండి వివాహము చేసుకొని జీవితాంతము కలిసియుండాలని ఎంతో ఎదురు చూస్తావు. వారిద్దరు మంచి ప్రవర్తన కలిగి ఏవిధమైన తప్పిదమునైనను పట్టించుకోనంతగా ఒకరినొకరు ప్రేమను కలిగియుందురు. చివరగా వివాహదినము సమీపించి వారి దాంపత్యజీవితము ప్రారంభమగును. వీరిద్దరు ఎంతో సంతోషముగా ఉండి ఒకరినొకరు ప్రేమను కలిగియుందురు. వీరు కొంతకాలము కలిసి జీవించిన తరువాత అవతలి వ్యక్తి యొక్క నిజరూపమును గ్రహించెదరు. లోపములన్నీ బహిర్గతము అగుచూ వివాహము అనగా మరియొక నిర్వచనము మనకు స్పురించును. ఇటువంటి సందర్భములో నూతన దాంపత్య జీవితములో పొందిన అనుభూతులు చెరిగిపోవుట ప్రారంభమగును.

ఇదేవిధంగా ప్రభువు విషయములో కూడా జరుగును. ఆయనను వివాహము చేసుకొనినప్పుడు, నీవు ఎంత గొప్ప వ్యక్తివో, ఎంత అందముగా ఉన్నావో మరియు ఆయన నిన్ను ఎంతగా ప్రేమించుచున్నాడో నీకు తెలియజేయును. కాని నీ మనస్సులో దాగియున్న లోపములను ఆయన నీకు చూపించినపుడు ఆయనతో మొదట నీవు పొందిన అనుభూతి నీ మనస్సులో నుండి చెరిగిపోవుట ప్రారంభమగును. నీ జీవితములో ఆయన (గొఱ్ఱెపిల్ల) వలె లేని లక్షణాల విషయంలో ఆయన కల్పించుకొని, నీ హృదయమును శుద్ధిచేయుట ప్రారంభించినపుడు పైన చెప్పిన అనుభవమును పొందెదవు. హృదయశుద్ధి ప్రక్రియ అనేది నిరంతరము జరుగుచుండి ఆయనతో ఏకమగు క్రియ. ఈ ప్రక్రియలో ఆయనను పోలిలేని లక్షణాలను ఆయన దహించివేయును. నీ జీవితములో ప్రతిభాగమును ఆయన ఆధీనములోనికి తెచ్చుటకు నేర్చుకొను ప్రక్రియ. ఇది నీ మనస్సును సంపూర్ణమైన క్రీస్తు మనస్సుగా మార్పుచేయు ప్రక్రియ.

ఈ హృదయశుద్ధి ప్రక్రియద్వారా నీ హృదయములోని ప్రతిభాగమునకు ఆయన ప్రభువుగా ఉండును. ఈ ప్రక్రియ జరిగే సమయంలో నీలోనున్న నీ స్వచిత్తము చంపి వేయబడి ''నా చిత్తము కాదు నీ చిత్తప్రకారము జరిగించుమని" చెప్పెదవు. నీ స్వచిత్తమునకు స్వస్తిచెప్పి, నీ స్వంత ప్రయాస మాని దేవుని విశ్రాంతిని అనుభవించెదవు. నీ స్వచిత్తమును ఆయనకు అప్పగించుట నేర్చుకొనుచున్నప్పుడు నీ మనస్సులో పోరాటములులేని స్థితికి నిన్ను తెచ్చును. నిరాశ, కలతను తీసివేసి నీతిని, సమాధానమును, ఆనందమును ఇచ్చును. ఈ హృదయశుద్ధి ప్రక్రియ సంపూర్తియైనప్పుడు నీలో మిగిలియుండేది గొఱ్ఱెపిల్ల యొక్క స్వభావము మాత్రమే. నీ శరీరమునకు మరియు ఆత్మకు మధ్య పోరాటము ఇక ఉండక నీ మనస్సు ఏకత్వమును మరియు సమన్వయమును కలిగియుండును. తండ్రి కుమారునితో ఏవిధముగా ఏకత్వమును కలిగియున్నారో అదేవిధముగా అన్ని విషయములలోను నీవు గొఱ్ఱెపిల్లతో విడిపోలేని నిజమైన ఏకత్వమును కలిగియుండెదవు.

ఈలోక సంబంధమైన వివాహములో వివాహమైన మొదటి దినాలలో నీవు నీ భార్యతో నిజమైన ఏకత్వమును కలిగియుండవు. దానికి ఎంతో శ్రమతోను, సహనముతోను దానిని సాధించుకొనవలసి యున్నది. దేవుని విషయములో కూడా అదేవిధముగా జరుగును. దేవునితో వివాహము జరిగినప్పుడు అన్ని విషయాలలో సంపూర్ణ ఏకత్వమును కలిగియుండవు. అప్పుడప్పుడు నీ మనస్సు తన స్థానము కొరకు కలతచెందుతూ తనకిష్టమైన దానిని చేయుటకు ప్రయత్నించును. సహజమైన స్త్రీ ప్రవర్తించునట్లుగా నీ మనస్సు ప్రవర్తించును. నీవు ప్రభువును వివాహము చేసుకొనినపుడు, ఆయన నీతో నిత్యత్వము వరకు భర్తగా ఉండుటకు ఒడంబడిక చేసుకొనియున్నాడు. కొన్నిసార్లు ఉదయమే నిద్ర నుండిలేచి నీ భర్తను చూచిపుడు, నీ మనస్సు "ఈదినం ఆయన చెప్పిన మాటకు కట్టుబడి ఉండనక్కరలేదు అని చెప్పును. నాకున్న పనులను చక్కబెట్టుటకు వెళ్ళవలసి యున్నది అని చెప్పును. అన్ని సమయములలోను మన మనస్సు భర్తకు విధేయత చూపుటకు ఇష్టపడదు. కొన్నిసార్లు మన మనస్సులేచి ఆయనమీద ఎదురుతిరిగి ఈదినం నీ మాటను వినను. నాకిష్టమైన దానిని చేయుదును అని చెప్పును. అధికారం చెలాయించే స్త్రీని ఎప్పుడైనా చూచితివా? అటువంటి స్త్రీ అసహ్యముగా ప్రవర్తించును. ఒక స్త్రీ అధికారం చెలాయించుట ప్రారంభించి "ఈదినం ఈ గృహమును నేను ఏలెదను" అని అనినచో ఏమి జరుగును. అనగా వివాదములు పుట్టించు వ్యక్తి దేవాలయములో నిలువబడి ''ఈ దేవాలయమునకు నేను దేవుడను" అని చెప్పినట్లుండును. అతనితో ఏమి జరుగునో గ్రహించినట్లయితే అతని మనస్సు యేమి చెప్పుననగా ''నా మనస్సా ఈదినము నరకమునకు మనము వెళ్ళుచున్నాము".

దీనికి దేవుని సమాధానము యేమిటనగా "ఇది మంచిదే" ఈదినమున నీ ఆత్మ నిన్ను నరకమునకు పోనిచ్చుటకు నేను అనుమతించుటకు గల కారణం, నావలెలేని నీ హృదయస్థితిని తీర్పుతీర్చుటకు, సరిచేయుటకు లేక దహించివేయుటకు నేను ఆశ పడుచున్నాను. నిన్ను నరకమునకు ఈడ్చుకొనిపోవు ఈ లక్షణములపై నీవు నీ దృష్టిని పెట్టి నాకు సమర్పించినచో వాటిని నేను దహించివేయుదును అనేది దేవుని ప్రతిస్పందన. దేవుడు హృదయమును నరకమునకు అనుమతించి నిన్ను నరకమునకు మొదటిస్థానములో వెళ్ళుటకు దోహదపడిన విషయాలను గ్రహించునట్లు చేయును. నీ హృదయం నరకంలో శాంతిలేక సంతోషములేక కొంతకాలము ఉండిన తరువాత మరియు ఈలోకసంబంధమైన వాటియందు జీవములేదు అని నీవు గ్రహించిన తరువాత "ఇది నాకు ఇష్టములేదు" అని నీ మనస్సు చెప్పును. అప్పుడు "స్త్రీ" తన భర్త వద్దకు పరుగున వెళ్ళి "నేను చాలా చింతించుచున్నాను, దయచేసి నన్ను క్షమించు" అని చెప్పును. ప్రభువా ఇప్పుడు నేను చేసినది ఎప్పటికి చేయను. నాలో నుండి దీనిని దహించివేయుము. నీ స్థానమును ఆక్రమించిన ప్రతిదానిని నా జీవతము

నుండి దహించివేయుము. ప్రభువా నీవు నాకు కావాలి. నీతో నేను ఏకమై ఉండాలని నేను ఆశించుచున్నాను. నేను నిన్ను అధికముగా ప్రేమించుచున్నాను అని చెప్పుదువు.

ఈ లోకసబంధమైన వివాహములో స్త్రీ వేకువనే నిదురలేచినపుడు మొదటిగా తన భర్త ముఖమును చూచుటకు కారణం? భర్త తన ప్రక్కనే పండుకొని యున్నాడు. అతనిని చూడకుండా వెళ్ళాలనుకున్నా ఆమె ఆవిధంగా చేయలేదు. కారణం ఆమె ప్రక్కనే అతను ఉన్నాడు. ప్రభువుతో కూడా అదేవిధముగా జరుగును. ఆయన నీలో ఉన్నాడు గనుక ఆయన నుండి పారిపోలేవు. నీ భర్త నీతో కలిసి బయటకు పోవుచూ మరియు లోనికి వచ్చుచున్నాడు. అలాగే నీవు నరకమునకు వెళ్ళునప్పుడు ఆయన నీతో ఉంటాడు. ఈ విషయాన్ని దావీదు భక్తుడు అర్ధం చేసుకుని ఈవిధంగా వ్రాస్తున్నాడు. కీర్తన 139:7,8 **"నీ ఆత్మ యొద్ద నుండి నేనెక్కడికి పారిపో వుదును? నీ సన్నిధి నుండి నేనెక్కడికి పారిపోదును? నేను ఆకాశమునకు ఎక్కినను నీవు అక్కడను ఉన్నావు. నేను పాతాళమందు పండుకొనినను నీవు అక్కడను ఉన్నావు"**

నిజంగా చెప్పాలంటే భార్యభర్తలలో ఒకరు మరియొకరిని నరకమునకు తీసుకొని వెళ్లవచ్చు. సహజముగా ఒకరు నరకమునకు వెళ్ళుచుంటే మరొకరు కూడా వారితో వెళ్ళుదురు. కుటుంబములో ఏమి జరిగినా దాని ప్రభావం కుటుంబమంతటిమీద ఉండుటకు కారణం మనమందరము క్రీస్తులో ఒకటిగా ఉన్నాము కాబట్టి దంపతులలో ఒకరు దేవునిపై తిరుగుబాటు చేసినచో దాని ప్రభావం రెండవ వ్యక్తిపై కూడా ఉండుటకు కారణం వారిద్దరు ఏకశరీరం కాబట్టి. దేవుని కుమారులైనవారు శుద్ధీకరణ ప్రక్రియ గుండా వెళ్ళవలసి ఉండుటకు కారణం దేవుని పోలికలోలేని విషయము మన శరీరములో ఉన్నట్లయితే క్రీస్తులో ఏకమనస్సు కలిగి నడవవలయును కాబట్టి మనలో ఆయన పోలికలో లేని ప్రతి విషయమును మన దృష్టికి తెచ్చుట ద్వారా వాటిని గ్రహించి ప్రభువు వాటిని దహించివేయుటకు అనుమతించెదము.

ఈ లోకములో ఎన్నో వివాహములు ఎక్కువ కాలం నిలుచుటలేదు. అలాగునే క్రైస్తవ వివాహములు కూడా నిలుచుట లేదు. చాలామంది దేవునితో ప్రారంభించెదరు. కాని వారి స్వమార్గమునందు నడుచుదురు. ఇక్కడ నేను చెప్పేది మీకు అర్ధమగుచున్నదా? చాలా సంవత్సరముల తరువాత దేవుడు ఇశ్రాయేలీయులను వదిలివేసాడు. యిర్మియా 3:6-8 **"...ద్రోహిణియగు ఇశ్రాయేలు చేయు కార్యమును నీవు చూచితివా? ఆమె ఉన్నతమైన ప్రతికొండమీదికిని, పచ్చని ప్రతిచెట్టు క్రిందికిని పోవుచు అక్కడ వ్యభిచారము చేయుచున్నది. ఆమె ఈ క్రియలన్నిటిని చేసినను ఆమెను నా యొద్దకు తిరిగిరమ్మని నేను సెలవియ్యగా ఆమె తిరిగి రాలేదు. మరియు విశ్వాసఘాతకురాలగు ఆమె సోదరియైన యూదా దానిని చూచెను. ద్రోహిణియగు ఇశ్రాయేలు వ్యభిచారము చేసిన హేతువుచేతనే నేను ఆమెను విడిచిపెట్టి ఆమెకు పరిత్యాగపత్రిక ఇయ్యగా విశ్వాసఘాతకురాలగు ఆమె, ఆమె సహోదరియగు యూదా చూచియు తానును భయపడక వ్యభిచారము చేయుచు వచ్చుచున్నది.**

దేవుడు ఆమెకు ఎందుకు విడాకులు ఇచ్చాడు? కారణం తనకుతాను ఇతర దేవుళ్ళతో అనగా రాతితోను, కర్రతోను అవినీతి మానవుని రూపమును పక్షుల్లో ,నాలుగుకాళ్ళ జంతువులు మరియు ప్రాకెడి పురుగులతో జారత్వమును నిరవధికముగా చేసినది. తన మొదటి ప్రేమను వదలి తన స్వంత శరీర ఆశలద్వారా తనకుతాను అపవిత్రమైన క్రియలకు అప్పగించుకొనెను. ఇశ్రాయేలీయుల పట్ల దేవుని ప్రేమ చాలా గొప్పది. ఎందుకనగా ఇటువంటి చెడుక్రియలు ఎన్ని చేసినప్పటికి ఆయన ఆమెను వెనుకకు రమ్మని బ్రతిమాలెను. అయినప్పటికి ఆమె ఆయన యొద్దకు రాని పక్షమున ఆయన ఆమెకు విడాకులు ఇచ్చినప్పుడు ఆమె అన్యదేశములకు ఒక గురుతుగా మారెను.

ప్రియులారా! వివాహమనగా ఏమిటి అనే దానిని గూర్చి మానవునికి చూపించడానికి దేవుడు ఎల్లప్పుడు ప్రయత్నిస్తూనే ఉన్నాడు. ఆత్మ సంబంధమైన వివాహము(క్రీస్తుతో ఏకత్వము కలిగియుండుట) అదే దేవుని రాజ్యము అనే విషయాన్ని మానవునికి చూపించడానికి దేవుడు ఎల్లప్పుడూ ప్రయత్నిస్తూ ఉన్నాడు. అది గొఱ్ఱపిల్లయైనటువంటి యేసుక్రీస్తుకు మరియు నీ ఆత్మకు మధ్యవుండే సంబంధము అనగా వారిద్దరు నీతి సమాధానములతో మరియు పరిశుద్ధాత్మతో క్రీస్తునందలి ఆనందములో ఏకత్వమును కలిగియుం దురు. ఇదే సూత్రమును మన గృహములలో, వివాహములలో అన్వయిం చుకొనవలసి యున్నది. ఇది ఇద్దరు వ్యక్తులు నీతియు, సమాధానమును మరియు పరిశుద్ధాత్మ యందలి ఆనందము ద్వారా ఏకత్వమును కలిగియుండుట. మన వివాహములలో విచారకరమైనది ఏమిటంటే దంపతులలో ఒక వ్యక్తి దేవునితో సంబంధము లేక యుండుట. కాని విశ్వాసి మొత్తం గృహమును పరిశుద్ధ పరుచును.

భార్యభర్తలు దేవుని దృష్టిలో ఏకశరీరము కనుక భర్త భార్యను అలాగే భార్య భర్తను సమర్ధించును లేక లోటును పూరించును.

ఎస్తేరు గ్రంధమునందు (నీ కొరకు నీవు దీనిని చదువుకొన వచ్చును) ఒకానొక కాలములో ఒక రాజు ఉండేవాడు. తన ఔన్నత్యమును ధనమును రాజ్యములో నున్న గొప్ప మరియు పేదవారికి చాటుకొనుటకు గొప్ప విందును ఏర్పాటు చేసియున్నాడు. ఆ రాజు అధికమైన బంగారమును, వెండిని మరియు ద్రాక్షరసమును కలిగి తనకున్నదంతా అందరికి తెలిసే విధంగా బహిర్గతము చెయ్యాలని ఆశించాడు. తన రాజ్యము మరియు ఐశ్వర్యము దేవుని రాజ్యమునకు సాదృశ్యముగా ఉన్నవి. తన రాజ్యములో ఉన్న ప్రతి పౌరుడు విందులో పాల్గొని అక్కడున్న ఆహారమును, ద్రాక్షారసమును మరియు అనేకరకములైన ఆనందములను పొందాలని ఆశించాడు. రాణిని విందులో నున్న ప్రజలందరు చూచుటకు ఆహ్వానించాడు. రాణిని ఆమె అందమును విందుకు వచ్చిన ప్రజలందరు చూచునట్లు ఆమెను ఆహ్వానించినప్పుడు ఆమె వచ్చుటకు నిరాకరించినది.

ఎస్తేరు గ్రంధములోని రాజు చేసినట్లుగా దేవుడు తన రాజ్యమును గూర్చి ధనరాసులను మరియు మహిమను గూర్చి తెలియజేయుటకు గొప్ప విందును ఏర్పాటు చేసియున్నాడు. "రండి! రాజ్యమును స్వతంత్రించుకొనండి" అని గొప్పవారిని, అల్పులను ప్రజలందరిని రమ్మని ఆహ్వానించాడు. రండి నా స్వభావముతో వస్త్రములు ధరించుకొనండి. బంగారమును స్వాధీనము చేసుకొనండి. వచ్చి నా సమాధానమును, ఆనందమును ఆస్వాదించండి. ఇవన్నీ మీకు ఇస్తున్నాను. వచ్చి వీటిని తీసుకొనెదరా? మీరు వచ్చి నా రాజ్యములో ఏకత్వమును కలిగియుండెదరా? ఎటువంటి వారైనా వారిని రానిచ్చెదను". క్రీస్తు సంఘంలోని అనేకమంది మరియు దేవుని కుమారులైన అనేకమంది సాకులు చెప్పి ఆయన వద్దకు వచ్చుటకు నిరాకరించుచున్నారు. గొఱ్ఱెపిల్ల యొక్క నామములో పిలువబడుట ద్వారా వచ్చే ఉపయోగాలను పొందుటకు ఇష్టపడుటయే గాని గొఱ్ఱెపిల్లను వివాహము చేసుకొనుటకు ఇష్టపడుట లేదు. ఎస్తేరు గ్రంధములో రాజు భార్య రాజు ఏర్పాటు చేసిన విందుకు వచ్చుటకు నిరాకరించినది. రాణియైన వష్తీ నిజముగా ఇశ్రాయేలీయులకు ప్రతినిధిగా ఉన్నది అని దేవుడు నాకు చూపించియున్నాడు. ఇశ్రాయేలీయులు దేవునిని తృణీకరించిరి. మరియు ఈ కారణముచేత రాజు ఆమెకు విడాకుల పత్రం ఇచ్చియున్నాడు.

రాణి ఇశ్రాయేలీయులకు ప్రతినిధిగా ఉన్నది. మరియు ఏమి చెప్పబడినదనిన స్త్రీలందరు ఆ స్త్రీ రాజును తృణీకరించిన విధమును గూర్చి వినిన కారణాన స్త్రీలు తమ భర్తలను ఎదిరించి తృణీకరించుదురేమో అని రాజ్యమంతయు ఒక శాసనము చేసి వష్తీ ఇక ఎన్నటికిని రాజ సముఖమునకు రావలదనియు, లేక ఆమెకు రాజు నుండి విడాకులు మంజూరు చేయబడినదని వారి చట్టములలో వ్రాయించెను. మరియు రాణి వష్తీకి బదులుగా ఆమెకంటే యోగ్యురాలుగా ఉండిన వ్యక్తికి రాజభవనములో (దేవుని రాజ్యములో) ఒక విశ్రాంతిగదిని కేటాయించబడినదని రాజ్యచట్టపుస్తకములలో వ్రాయించెను. రాజ దయను పొందగల కన్యను వష్తీకి బదులుగా రాణిగా ప్రకటించబడును అని ప్రకటించబడెను. ప్రకటన 14:4ను జ్ఞాపకము చేసుకొనినట్లయితే అక్కడ నూటనలుబదినాలుగు వేలమంది ఉన్నారు. వారు స్త్రీ సాంగత్యమున అపవిత్రులుకానివారును, స్త్రీ సాంగత్యమును ఎరుగని వారునై యుండి గొఱ్ఱెపిల్ల ఎక్కడికి పోవునో అక్కడికెల్లను ఆయనను వెంబడింతురు. వీరు దేవుని కొరకును, గొఱ్ఱెపిల్ల కొరకును ప్రధమఫలముగా ఉండుటకై మనుష్యులలో నుండి కొనబడినవారు.

వష్తీ రాజును నిరాకరించిన కారణాన ఆమెకున్నదంతయు ఆమె పోగొట్టుకొని రాజ్యములో నున్న భార్యలందరు తమ భర్తలను గౌరవించునట్లుగా ఆమె ఒక గురుతుగా చేయబడెను. ఇప్పుడు ప్రకటనలో చెప్పబడిన ఏడు సంఘములకు స్త్రీలు సాదృశ్యముగా ఉండిరి అని దేవుడు నాకు బయలుపరచియున్నాడు. అలాగుననే యెషయ 4వ అధ్యాయములో చెప్పబడిన ఏడుగురు స్త్రీలకు సాదృశ్యముగా ఆ ఏడు సంఘములు ఉన్నవి. మొదట రాణికి విడాకులు ఇచ్చిన తరువాత రాజు ఏమి చేశాడు? మరియొక కన్య ఎస్తేరును ఎన్నుకొనుటకు సిద్ధపడి ఆమెను రాణిగా చేశాడు. కాని ఎస్తేరును ఎన్నుకొని రాణిగా చేయబడక మునుపు ఆమె పన్నెండునెలలు శుద్ధిచేయబడెను. పన్నెండు అనగా దేవుని రాజ్యమును తిరిగి స్థాపించుట. అనగా శుద్ధి ప్రక్రియ ద్వారా ఆమె హృదయమును దైవాధికారము క్రిందకు తెచ్చుట. మరియు భూమి పునాదులు వేయబడక మునుపు దేవునితో కలిగిన ఏకత్వమును తిరిగిపొందుట. ఇదేవిధముగా దేవుని కుమారులైన వారందరు ఈవిధమైన శుద్ధి ప్రక్రియ ద్వారా వెళ్లవలసి యున్నది.

యెషయ 4:1 లో **<u>ఆ దినమున</u>** (ప్రభువు దినమును గూర్చి చెప్పబడినది) **<u>ఏడుగురు స్త్రీలు ఒక పురుషుని పట్టుకుని...."</u>** ఇక్కడ ఏడుగురు స్త్రీలను గూర్చి చెప్పబడినది. ఈ ఏడుగురు స్త్రీలు క్రీస్తు సంఘంలోని ఏడు సంఘములను

గూర్చి చెప్పబడుచున్నది. ఆ దినమున వారు ఒక పురుషుని (క్రీస్తు)ని పట్టుకొని అని వ్రాయబడి యున్నది. ఇక్కడ సమస్య ఏమిటంటే ఆ స్త్రీలు వారి మొదటి భర్తను సమాధి చేయలేదు. వారి పూర్వపుమానవుని (ఆదాము)ను అంటుపెట్టుకొని యున్నారు. అప్పుడు మరియొక వ్యక్తి (భర్త) వద్దకు చేరినచో వారు వ్యభిచారము చేయుచున్నారు.

ఈ దినమున (ప్రభువు దినము) వారు ప్రభువు యొద్దకు వచ్చి మా ఆహారము తిందుము. మా వస్త్రమే ధరంచుకొందుము. కాని నీ పేరు మాకు పెట్టి మామీద నున్న నిందను తొలగించుము అని చెప్పుదురు. అనగా నీ పేరున పిలవబడతాము గాని నీ పేరుగా మాత్రం మారము అని చెప్పుదురు. పేరుకు మాత్రం నీతో వివాహము చేసుకొనెదము గాని మాయొక్క లోకసంబంధమైన ఆలోచనలలో కొనసాగెదము. మాయొక్క మతసంబంధమైన ఆచారములు, సిద్ధాంతములు మరియు నమ్మకములలో కొనసాగుదము. మరియు మాయొక్క స్వనీతిని, స్వబుద్ధిని ఆధారము చేసుకొనెదము. స్వచిత్తమును అనుసరిస్తూ శరీరక్రియలు మరియు కామాభిలాషలతోను మొదటి భర్తతోను (ఆదాము) తృప్తి పొందెదము. దేవుడా నీ నామము నుండి వచ్చే ప్రతిఫలములు, ఆశీర్వాదములు మాకు కావాలి. మాకు రెండువిధములైనవీ కావాలి. ఇక్కడ సమస్య ఏమిటంటే మీ మొదటి భర్త (ఆదాము) జీవించియున్నంత కాలము అతనితో కొనసాగినట్లయితే అతడు నిన్ను పాపనియమము క్రిందకు నింద మరియు తీర్పు క్రిందకు లాగుచుండును.

(ప్రభువు దినమందు) ఆ దినమందు వారు క్రీస్తును పట్టుకొనియున్నారు. కాని మొదటి ఆదామును కూడా పట్టుకొనియున్నారు. ఈ భూసంబంధమైన మొదట ఆదామును వివాహము చేసుకొనియుందురు. మరియు రెండవ ఆదాము అయిన పరలోకము నుండి వచ్చిన ప్రభువును కూడా వివాహము చేసుకొందురు. గాని రోమా 7:1-6 వాక్యములో ఈవిధంగా వ్రాయబడింది. **<u>సోదరులారా! మనుష్యుడు బ్రతికినంత కాలమే ధర్మశాస్త్రమతనిమీద ప్రభుత్వము చేయుచున్నదని మీకు తెలియదా? ధర్మశాస్త్రము ఎరిగిన మీతో మాట్లాడు చున్నాను. భర్తగల స్త్రీ భర్త బ్రతికియున్నంత వరకే ధర్మశాస్త్రము వలన అతనికి బద్ధురాలు గాని భర్త చనిపోయిన యెడల భర్త విషయమై ధర్మశాస్త్రము నుండి ఆమె విడుదల పొందును. కాబట్టి భర్త బ్రతికియుండగా ఆమె వేరొక పురుషుని చేరిన యెడల వ్యభిచారిణి అనబడును గాని, భర్త చనిపోయిన యెడల ఆమె ధర్మశాస్త్రము నుండి విడుదల పొందెను. గనుక వేరొక పురుషుని వివాహము చేసుకొనినను వ్యభిచారిణి కాకపోవును. కావున నా సహోదరులారా! మనము దేవుని కొరకు ఫలమును ఫలించునట్లు మృతులలో నుండి లేపబడిన క్రీస్తు అను వేరొకని చేరుటకై మీరును ఆయన శరీరము ద్వారా ధర్మశాస్త్ర విషయమై మృతులైతిరి. ఏలయనగా మనము శరీరసంబంధులమై యుండినప్పుడు మరణార్థమైన ఫలమును ఫలించుటకై ధర్మశాస్త్రము వలననైన పాపేచ్ఛలు మన అవయవములలో కార్యసాధనములై యుండెను. ఇప్పుడైతే దేనిచేత నిర్బంధించబడితినేమో దాని విషయమై చనిపోయినవారమై ధర్మశాస్త్రము నుండి విడుదల పొందితిమి. గనుక మనము అక్షరానుసారమైన ప్రాచీనస్థితి గలవారముగా గాక ఆత్మానుసారమైన నవీనస్థితి గలవారమై సేవ చేయుచున్నాము.</u>** రోమా 6:1-11 నందు **<u>అలాగైన ఏమందుము? కృప విస్తరింపవలెనని పాపమందు నిలిచియుందుమా? అట్లనరాదు. పాపము విషయమై చనిపోయిన మనము ఇకమీదట ఎలాగు దానిలో జీవించుదుము? పాతపురుషుడు చనిపోయియున్నాడు. మన మరణము భూస్థాపన మరియు క్రీస్తులో పునరుత్థానమును గూర్చి చెప్పుచున్నది. క్రీస్తుయేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితి మని మీరెరుగరా? కాబట్టి తండ్రి మహిమ వలన క్రీస్తు మృతులలో నుండి ఎలాగు లేపబడెనో అలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడుచుకొనునట్లు మనము బాప్తిస్మము వలన మరణములో పాలుపొందుటకై ఆయనతో కూడా పాతిపెట్టబడితిమి మరియు ఆయన మరణము యొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యముగలవారమైన యెడల ఆయన పునరుత్థానము యొక్క సాదృశ్యమందును ఆయనతో ఐక్యముగలవారమై యుందుము. ఏమనగా మనమికను పాపమునకు దాసులము కాకుండునట్లు పాపశరీరము నిరర్థకమగునట్లు మన ప్రాచీనస్వభావము ఆయనతో కూడా సిలువవేయబడెనని యెరుగుదుము. చనిపోయినవాడు పాపవిముక్తుడని తీర్పు పొందియున్నాడు. మనము క్రీస్తుతో కూడా చనిపోయిన యెడల మృతులలో నుండి లేచిన క్రీస్తు ఇకను చనిపోడనియు మరణమునకు ఇకను ఆయనమీద ప్రభుత్వములేదనియు యెరిగి ఆయనతోకూడా జీవించుదుమని</u>**

**నమ్ముచున్నాము. యేలయనగా ఆయన చనిపోవుట చూడగా పాపము విషయమై ఒక్కమారే చనిపోయెనుగాని ఆయన జీవించుట చూడగా దేవుని విషయమై జీవించుచున్నాడు. అటువలె మీరును పాపము విషయమై మృతులుగాను, నీతి విషయమై క్రీస్తుయేసునందు సజీవులుగాను మిమ్మును మీరే ఎంచుకొనుడి.**

నీవు మొదటి భర్తను లేక పూర్వపు పురుషుని లేక మొదటి ఆదామును హత్తుకొని యున్నంత కాలము నీవు వ్యభిచారము చేయుచున్నావు కాని ఒకవేళ మొదటి ఆదాము మరణించినట్లయితే నీవు ఎన్నటికిని పాపమరణ నియమము క్రింద ఉండవు. మనలను మనము చనిపోయినవారుగా పరిగణించుకొని క్రీస్తులో సజీవులుగా ఉన్నామని తలంచుకొనవలెను. మనము ఒకే భర్తను కలిగియుండాలి. ఆ భర్త క్రీస్తు. ఈ విషయములు పౌలు అర్థము చేసుకొని గలతీయులు 2:20 నందు ఈవిధముగా వ్రాయుచున్నాడు. **నేను క్రీస్తుతో సిలువవేయబడి యున్నాను. జీవించువాడను నేను కాను.** (నిజమైన వ్యక్తిత్వము క్రీస్తే అని అర్థము చేసుకొనియున్నాడు). **నేను కాదు** (తనకుతాను పూర్వపు మనుష్యునితో లేక స్వచిత్తముతో గుర్తింపబడుట లేదు). కాని **క్రీస్తే నాయందు జీవించుచున్నాడు. ఈ శరీరములో నేను జీవించే జీవితము దేవుని కుమారుడు** (ఇది పౌలు ఇంతకుమునుపు జీవించిన విశ్వాసము కాదు గాని ఇది క్రీస్తు ద్వారా జీవింపజేయుచున్న విశ్వాసము) **నన్ను ప్రేమించిన మరియు నాకొరకు ప్రాణము పెట్టిన దేవుని కుమారునిపైనున్న విశ్వాసము ద్వారా జీవించు చున్నాను**. మరొక మాటలో చెప్పాలంటే నాలో నున్న పూర్వపు వ్యక్తి మరణించాడు. నేను గొఱ్ఱెపిల్లకు వివాహము చేయబడ్డాను. గొఱ్ఱెపిల్లయైన క్రీస్తు మరియు నేను ఏకమై యున్నాము. నీవు క్రీస్తుకు వివాహము చేయబడి ఆయనతో ఏకత్వమును కలిగి జీవించుచున్నప్పుడు ఈ లోకములో ఆత్మఫలములను ఫలించెదవు. గొఱ్ఱెపిల్ల స్వభావము నీ ద్వారా క్రియ చేయబడి దానిద్వారా ఫలించే ఫలములను ఇతరులు అనుభవించుటకు వీలు కలుగును. తండ్రియైన దేవుడు భర్తయై యున్నాడు. మరియు చాలాకాలము నుండి ఈ ఫలములో పాలు పొందుట కొరకు వేచియున్నారు. యాకోబు 5:7 నందు ఈవిధంగా వ్రాయబడి యున్నది– **"సహోదరులారా! ప్రభువు కారడ వరకు ఓపిక కలిగియుండుడి, చూడుడి, వ్యవసాయకుడు తొలకరి వర్షమును, కడవరి వర్షమును సమకూడు వరకు విలువైన ఫలము నిమిత్తము ఓపికతో కాచుకొనుచు దాని కొరకు కనిపెట్టును కదా!"** గొఱ్ఱెపిల్లతో నీకు వివాహమైనప్పుడు నీవు అధికముగా ఫలములను ఫలించుచున్నప్పుడు చాలాకాలము నుండి ఎదురుచూచుచున్న దేవుడు ఈ ఫలములలో పాలిభాగస్తులు అగుటకు ఇష్టపడుచున్నాడు. ఈ భూమి పునాదులు వేయబడక మునుపు నుండి ఈ సృష్టిలో ఆయన చేసిన క్రియద్వారా వచ్చిన ఫలములతో పాలిభాగము కావలెనని ఆయన ఆశిస్తున్నాడు. ఈ వివాహములో ప్రభువు బల్లయొద్దకు నీవు చేరినపుడు ఒకరినొకరు పోషింపబడుదురు. నీముందు ఉంచబడిన ఆనందమును, సమాధానమును మరియు షరతులులేని ఒకరి నుండి మరియొకరకు ప్రవహించే ప్రేమను ఒకరి నుండి మరొకరు అనుభవించెదరు. ఈ ప్రేమ (ఆయన ప్రేమ) మిమ్మును ఒకటిగా చేసినది. రాజు ఒక విందును ఏర్పాటుచేసి ఆయన రాజ్యములోని ఐశ్వర్యము అంతయు వారు అనుభవించాలని సమస్తమైనవారిని విందుకు ఆహ్వానించాడు. కావున మనము గమనించవలసినది ఏమిటంటే మన స్వచిత్తము అనగా మొదటి భర్త అయినటువంటి ఆదాము మరణించాడు. మనము మరణమును జయించి తిరిగిలేచిన వానిని వివాహము చేసుకొనుట ద్వారా దేవునికి ఫలములు ఫలించవలెను. మనము బాప్తిస్మమును పొందినప్పుడు చాలా విషయములు జరుగును. వాటిని గూర్చి బోధించే సమయం ఇప్పుడు లేదు. గాని మనం బాప్తిస్మము తీసుకొనుటకు గల రెండుకారణములేవనగా మొదట పూర్వపు మనుష్యుని పాతిపెట్టుట, రెండవది క్రీస్తును వివాహము చేసుకొనుట. ఆవిధముగా చేయుట ద్వారా దేవుని నీతి మరియు నిజమైన పరిశుద్ధతయు అనే క్రొత్త శరీరము ధరించుకొందుము. నీటిద్వారా క్రీస్తులోనికి బాప్తిస్మ అనుభవము పొందినవారందరు క్రీస్తువలె బాప్తిస్మము తరువాత అరణ్య అనుభవము గుండా వెళ్ళవలసి యున్నది. అనగా నీవు అగ్ని గుండా వళ్ళవలసి యున్నది. అగ్నిగుండా వెళ్ళుట అహ్లాదకరమైన అనుభవము కానప్పటికి అది తప్పనిసరి. గొఱ్ఱెపిల్లతో ఏకత్వమగుటకు మనమందరము పవిత్రపరచబడే ప్రక్రియలో భాగముగా ఇది జరుగును. యెషయ 4:1 నందు ఆ దినమున ఏడుగురు స్త్రీలు ఒక మనుష్యుని పట్టుకొని మేము మా రొట్టెను తిందుము అందురు. వారు వారివారి స్వంత రొట్టెను మాత్రము తిందురు గాని వారికి జీవాహారము అవసరము లేదు. వారికి వారి ఆచారములు, వారి సిద్ధాంతములు, వారి మతవిశ్వాసములు కావాలి. వారి స్వంతపద్ధతిని ఆలోచనలను మరియు వాక్యముయొక్క స్వంత తర్జుమాలను వారు ఇష్టపడెదరు. దేవుని ఆత్మ ద్వారా వచ్చే

వాక్యము వారి జీవితములో మార్పు తెచ్చును. కావున దానిని వారు ఇష్టపడరు. యేసుక్రీస్తు ఇశ్రాయేలీయుల యొద్దకు వచ్చి దేవుని రాజ్యమును వారికిచ్చినప్పుడు వారు దానిని నిరాకరించుట జరిగినది. యెషయ 4:1 మేము మా అన్నమే తిందుము. మా వస్త్రములే కట్టుకొందుము అని వ్రాయబడినది. క్రీస్తు ఇచ్చే వస్త్రమును నూతన పురుషుని ధరించుకొనుటకు వారికి ఇష్టములేదు. ఆయన నీతియందును లేక ఆయన భార్యగా పిలువబడే ఆమె సౌంధర్యమును అందరు పొగడుటకు నిరాకరించుటకు గల కారణం, ఇంకను ఆమె ఒక వ్యభిచారిణిగానే ఉండుటకు నిర్ణయించుకొనినది. కాని ప్రకటన 19:7-9 నందు గొఱ్ఱెపిల్ల మరియు ఆయన భార్యను గూర్చి వివరించబడినది. ఎవరైతే శుద్ధి ప్రక్రియ ద్వారా పంపబడి, తమకుతాము సిద్ధపరచుకొని ఆయనతో ఏకత్వమును కలిగి ఆయనతో మాత్రమే కలిగి ఉన్నవారిని చూచి ఈవిధంగా చెప్పబడినది. గొఱ్ఱెపిల్ల వివాహోత్సవ సమయం వచ్చినది. ఆయన భార్య తననుతాను సిద్ధపరచుకొని యున్నది. కనుక మనము సంతోషపడి ఉత్సాహించి ఆయనను మహిమ పరచెదమని చెప్పగా వింటిని. మరియు ప్రకాశమును, నిర్మలమునైన సన్నపు నారబట్టలు ఆమె ధరించుటకు ఆమెకు అనుమతి ఇవ్వబడెను. సన్నపు నారవస్త్రములు పరిశుద్ధుల నీతిక్రియలు. (క్రీస్తు ఆ సన్నపు నారవస్త్రము) మరియు ఆయన నాతో గొఱ్ఱెపిల్ల వివాహమునకు ఆహ్వానించబడినవారందరు ధన్యులు అని చెప్పెను.

గొఱ్ఱెపిల్ల వివాహవిందునకు ఆహ్వానింపబడినవారందరు ధన్యులు. బాప్తిస్మమునందు నీ పూర్వపు మనుష్యుని సమాధి చేసి ప్రభువును వివాహము చేసికొనినట్లయితే ఆయన నీతి వస్త్రము నీకు ఇయ్యబడి అందరు వచ్చి చూచునట్లుగా పైన కూర్చుండబెట్టును. కొన్ని సంవత్సరముల క్రిందట ప్రభువు నన్ను కారాగారములో నున్న పన్నెండుమందికి బాప్తిస్మము కారాగార స్నానపుతొట్టిలో ఇవ్వమని చెప్పిన దానిని మరువలేను. ఆ క్రియ ద్వారా వారు గొఱ్ఱెపిల్లలను వివాహము చేసుకొన్న తీర్మానమును చూచి నేను అత్యున్నతమైన దేవుని ఆనందమును అనుభవిం. వారు ప్రభువుతో ఏకత్వమును కలిగి ఆయన ఫలములను లేక ఆయన స్వభావమును కలిగి ఉండుటకు ఆశపడియున్నారు.

ఒక వ్యక్తి దేవుని వివాహము చేసుకొనుటకు తీర్మానము చేసికొనినట్లయితే దేవుడు అత్యంత ఆనందమును పొందుతాడు. ఎందుకంటే ఆయనతో ఒక ఒడంబడిక చేసుకొనుటకు నిర్ణయం తీసుకొనియున్నాడు గనుక ఒక వ్యక్తి ప్రభువును వివాహమాడితే వారు దేవుని కొరకు ప్రత్యేకింపబడినవారై మనుష్యుల వాయిద్యము నుండి విడిపింపబడి ప్రత్యేకింపబడి ఈ భూమిపై రాజుగాను,దేవుని యాజకునిగాను ఉండెదరు. యెషయా గ్రంధములో వ్రాయబడినట్లు **ఆ దినమున ఏడుగురు స్త్రీలు ఒక మనుష్యుని పట్టుకొని మా ఆహారమే తిందుము. మా వస్త్రములే కట్టుకొందువు. నీ పేరుమాత్రమే మాకు పెట్టి మా నిందను తీసివేయమని చెప్పుదురు.** వారు పేరుకు మాత్రం వివాహము చేసుకొనుటకు గల కారణం వారికున్న నిందను తీసివేసుకొనుటకు. వారు ఏవిధమైన ఒడంబడిక గాని లేక జీవితవిధానములో మార్పుగాని కోరక, క్రీస్తును వివాహము చేసుకొనుట ద్వారా వచ్చే ప్రయోజనాలు మాత్రం కోరుచున్నారు.

తరువాత రెండవ వచనంలో ఈవిధంగా చెప్పబడుచున్నది- **"ఆ దినమున యెహోవా చిగురు మహిమయు, భూషణమగును".** చిగురు అనగా ద్రాక్షతీగలో అంటు కట్టబడినది. నీవు ఆయనలో అంటు కట్టబడకపోయినట్లయితే ఆత్మ ఫలములు ఫలించలేవు. యోహాను 15వ అధ్యాయములో (పదిహేను) అనగా విశ్రాంతి. క్రీస్తులో నీవు అధికమైన విశ్రాంతిని పొందుటకు నిన్ను పిలచుచున్నాడు. నీవు ద్రాక్షవల్లిలో ఆయన (విశ్రాంతిలో) అంటుకట్టబడి ఉంటేనే నీవు ఆత్మఫలములు ఫలించగలవు. నీవు అధికమైన ఫలములను ఫలించుటకును, ఈ భూమిపై ఆయన సంపూర్ణత్వమును ప్రభలము చేయుటకును ఆయన నిన్ను పవిత్రపరచును.

యోహాను 15:1-5 నందు **నేను నిజమైన ద్రాక్షవల్లి. నా తండ్రి వ్యవసాయకుడు. నాలో ఫలించని ప్రతితీగెను ఆయన తీసిపారవేయును. ఫలించు ప్రతితీగె మరి ఎక్కువగా ఫలింపవలెనని దానిలోని పనికిరాని తీగెలను తీసివేయును. నేను మీతో చెప్పిన మాటను బట్టి మీరిప్పుడు పవిత్రులై యున్నారు. నాయందు నిలిచియుండుడి. మీయందు నేనును నిలిచియుందును. తీగె ద్రాక్షవల్లిలో నిలిచియుంటనేగాని తనంతట తానే ఏలాగు ఫలింపదో ఆలాగే నాయందు నిలచియుంటేనే గాని మీరును ఫలింపరు. ద్రాక్షవల్లిని నేను. తీగెలు మీరు. ఎవడు నాయందు నిలిచియుండునో (నాలో ఏకమై యుండుట) నేను ఎవనియందు నిలిచియుందునో వాడు బహుగా ఫలించును.** నాకు వేరుగా ఉండి మీరేమియు చేయలేరు. కాబట్టి తండ్రి వ్యవసాయకుడు. యేసు ద్రాక్షావల్లి. మీరు తీగెలు. ఫలము ఫలించే తీగె మరి ఎక్కువగా ఫలింపవలెనని తండ్రి శుద్ధిచేయును. క్రమశిక్షణలో పెట్టును. సరిచేయును. అని

యేసు చెప్పియున్నాడు. నీవు క్రీస్తుతో సహవాసము కలిగియున్నప్పుడు ఫలములు కలుగును. ఫలము అనేది దేవుని స్వభావమును నీ ద్వారా ఈలోకములో ప్రభలము చేయుట.

హెబ్రి 12:6,7 మరియు 11 వ వచనములో ప్రభువు తాను ప్రేమించువారిని శిక్షించి తాను స్వీకరించు ప్రతికుమారుని దండించును. నిన్ను క్రమశిక్షణలో పెట్టుటకు నిన్ను నీవు ప్రభువునకు సమర్పించుకొని ఓర్పు కలిగియుండాలి. ఏ తండ్రియైన తన కుమారునికి తర్ఫీదు నివ్వక మరియు క్రమశిక్షణలో పెట్టక యుండునా? దేవుడు తన కుమారునిపట్ల తన వైఖరి ఉండునట్లు నీ యెడల కలిగియున్నాడు. క్రమశిక్షణ గుండా వెళ్ళుచున్నప్పుడు ఆనందంగా ఉండక, బాధాకరముగాను, దుఃఖకరముగాను ఉండును. గాని తరువాత సమాధానకరమైన నీతి ఫలములు ఫలించును. (ఎవరైతే తర్ఫీదు చేయబడ్డారో వారిద్వారా) దేవుని చిత్తానుసారమైన ఉద్ధేశ్యము కలిగిన ఆలోచన మరియు క్రియ కలిగిన నీతివంతమైన ఫలముల పంట ద్వారా దేవునిలో నలిచియుండిన సరియైన జీవితమునకు కారణమగును. ఎవరినైతే దేవుడు తన కుమారుల వలె ప్రేమిస్తాడో వారు సమాధానకరమైన నీతి ఫలములు ఫలించి ఈ భూమిపై ఆయన స్వభావమును ప్రచురపరచుటకు వారిని శుద్ధిచేసి సరిచేసి మరియు క్రమశిక్షణలో పెట్టును.

పరలోకపు తండ్రి వధూవరులను వివాహమునకు సిద్ధపరచునప్పుడు వారి జీవితములలో తండ్రిచేసే శుద్ధి ప్రక్రియను వారు అనుభవించుచుందురు. ఒక్కొక్కసారి తండ్రి వారిని అగ్నిలో ఉంచినప్పుడు వారికి ఏమి జరుగుచున్నదీ వారికి అవగాహన ఉండదు గాని దేవుడు ఏమి చేయుచున్నాడో ఆయనకు తెలియును. ఈ సంగతులన్నీ వారి జీవితములో జరుగుటకు, దేవుడు అనుమతించుటకు గల కారణం వారు ఆయనతో అధికమైన ఏకత్వమును మరియు తోటివారితోను ఏకత్వమును కలిగియుందురు. దంపతులు వారి జీవితమును సరిచేయుటకు దేవునిని అనుమతించినట్లయితే వారు మరి ఎక్కువగా దేవునితో ఏకత్వమును మరియు ఒకరితో ఒకరు ఐక్యతను కలిగియుందురు. దేవునితో మనకున్న ఏకత్వము మన జీవితములో క్రియచేయును. దానిద్వారా ఐక్యత మనము అనుభవించగలము. ఒకవ్యక్తి ప్రభువుతో ఏకత్వమును కలిగియుండినప్పుడు ఆత్మఫలములను వారు కలిగియుందురు. దంపతులలో ఒకరు దేవునిని శుద్ధిచేయుటకు అనుమతించకపోయినట్లయితే వారి జీవితములో కలతలు మరియు పట్టుదలలు చోటు చేసుకొనును. అప్పుడు వారు ప్రతివిషయమును దేవుని యొద్ద చెప్పుకొందురు అని, ప్రభువు తిరుగుబాటు చేసేవ్యక్తిని రెండవ వ్యక్తి ద్వారా ప్రభువు యొద్దకు వచ్చునట్లు చేయును. రోమా 8:28 ఈవిధంగా చెప్పబడినది- **''దేవుని ప్రేమించువారికి అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడినవారికి మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని యెరుగుదుము".**

తిరుగుబాటు చేయు వ్యక్తి ప్రభువు యొక్క శిక్షను అంగీకరించక క్రీస్తుతో ఏకత్వమునకు రానట్లయితే దేవుడు వారికి తీర్పుతీర్చి ఇశ్రాయేలీయుల వలె తామును బాహ్యాచీకటిలోనికి త్రోసివేయును. గాని తండ్రి తన సమయంలో వారిని సరిచేయుటకు పూనుకొనును. యిర్మియాలోను మరియు ప్రకటన గ్రంధములోను అనేకచోట్లు ఈవిధంగా చెప్పబడెను. సమయము సమీపించుచున్నప్పుడు **"సంతోషనాదమును, ఉల్లాసశబ్ధమును, పెండ్లికుమారుని స్వరమును, పెండ్లికుమార్తె స్వరమును, తిరుగటిరాళ్ళ ధ్వనిని, దీపకాంతిని వారిలో ఉండకుండా చేసెను.** (యిర్మియా 25:10) పెండ్లికుమారుని స్వరమును, పెండ్లికుమార్తె స్వరమును వారు వినలేరు.

బబులోను పతనమును గూర్చి యిర్మియా మరియు ప్రకటన గ్రంధములో వ్రాయబడింది. ఎవరైతే వారి జీవితమును సరిచేయుటకు తండ్రిని అనుమతించరో, ఎవరైతే బబులోనులోనే ఉండి గొఱ్ఱెపిల్ల వివాహమునకు వచ్చుటకు నిరాకరించుదురో వారు పతనమగుదురు. ప్రకటన 14:8 నందు ఈవిధంగా చెప్పబడినది- **"వేరొకదూత అనగా రెండవ దూత అతనివెంబడి వచ్చి మహోద్రేకముతో కూడిన తన వ్యభిచార మద్యమును సమస్తజనములకు త్రాగించి, మహాబబులోను కూలిపోయెను, కూలిపోయెను" అని చెప్పెను.** యెషయ 4:2లో ఈవిధంగా చెప్పబడింది- **"ఆ దినమున యెహోవా చిగురు, మహిమయు భూషణమగును.** ఆ కొమ్మ ఎందుకు అందముగాను, మహిమ కరముగాను ఉండును? ఆ కొమ్మ ద్రాక్షవల్లిలో అంటుకట్టబడి యుండుటను బట్టి. ఆ ఏకత్వము ద్వారా దేవుని స్వభావమును సంతరించుకొనును. కాబట్టి ఆ కొమ్మ నీతియుక్తమైన సమాధాన ఫలమును ఫలించుచున్నది. ఆమె కుమారుని యొక్క మహిమాయుక్తమైన వస్త్రములను ధరింపచేయవలెనని శుభ్రమైన దవళవస్త్రములు మరియు సన్నపునార వస్త్రములతో అలంకరించబడినది. ఆమె యేసు అనే క్రొత్తవ్యక్తిని ధరించుకొని గొఱ్ఱెపిల్ల స్వభావమును సంతరించుకొనినది.

నీవు ప్రభువుకు వివాహము చేయబడినప్పుడు ఈవిధంగా జరుగును. నీవు మొదటిగా ప్రభువుతో సంబంధమును కలిగియుండి, ప్రతిదినము ఆయనను వెంబడించి ఆయనతో సంభాషించినట్లయితే నీ చుట్టూ ఉన్న ప్రజలు నీమీద ఉన్న దేవుని మహిమను చూచెదరు. దేవుని సన్నిధి వెలుగు నీలో నుండి ప్రకాశించుట వలన నీచుట్టు ఉన్న ప్రజలు దానిని ఎదుర్కొనలేక నీనుండి దూరముగా వెడలిపోవుదురు. కాని పసివారు చిన్నపిల్లలు నీచుట్టు చేరినపుడు నీచుట్టు ఆశ్చర్యముగా చూచుటకు గల కారణం వారు నీతోను నీ పైన ఉన్న ప్రభువును చూచియున్నారు గనుక. వారి మనస్సులు ఈలోక విషయములో కలుషితము కాలేదు గనుక. వారు వారివారి నిర్మాణకుని లేక సృష్టికర్తను అనగా వారు ఈలోకమునకు వచ్చుటకు ముందు విడిచిపెట్టినవానిని చూచుచున్నారు. వారు గొఱ్ఱెపిల్లను చూచున్నారు. యెషయ 4:2 నందు ఇంకను ఈవిధంగా చెప్పబడింది. భూమిపంట అతిశయాస్పదముగాను, సుభలక్షణముగాను ఉండును. యాకోబు 5:7లో ఈవిధంగా చెప్పబడింది- **“వ్యవసాయకుడు తొలకరి వర్షమును, కడవరి వర్షమును సమకూడు వరకు విలువైన భూఫలము నిమిత్తము ఓపికతో కాచుకొనుచు దాని కొరకు కనిపెట్టునుగదా'',** ఇక్కడ ప్రభువు దినమును గూర్చి మరియు తండ్రి ఆయన పంటను స్వీకరించుటను గూర్చి చెప్పబడింది. ఇశ్రాయేలీయులలో తప్పించుకొనినవారికి అని ఎందుకు చెప్పబడింది? రోమా 11:25,26లో ఈవిధంగా చెప్పబడింది- “అన్యజనుల ప్రవేశము సంపూర్ణమగు వరకు ఇశ్రాయేలునకు కఠినమనస్సు కొంతమట్టుకు కలుగును. వారు ప్రవేశించునప్పుడు విమోచకుడు సియోనులో నుండి వచ్చి యాకోబులో నుండి భక్తిహీనతను తొలగించును. నేను వారి పాపములను పరిహరించునప్పుడు నీ వలన వారికి కలుగు నిబంధన ఇదియే అని వ్రాయబడినట్లు **ఇశ్రాయేలు జనులందరును రక్షింపబడుదురు''.** అవును ఇశ్రాయేలు రాజును మరియు ఆమె భర్తయైన క్రీస్తును తృణీకరించినది గాని ఆమె అలాగు చేయుట దేవుని ప్రణాళికలోని భాగమైయున్నది. ఆమె క్రీస్తును తృణీకరించుట ద్వారా ఆమె బయటకు గెంటివేయబడినది. తద్వారా నీవు మరియు నేను లోనికి రాగలిగాము. దేవుని ప్రణాళికలో ఆమె కొంతకాలము బయటకు నెట్టబడాలి. కాని ప్రభువు దినమున ఆమె తిరిగి సమాధానపరచబడును.

“పరలోక రాజ్యము తన కుమారుని వివాహమును ఏర్పాటు చేసిన రాజును పోలియున్నది'' యేసు తన మొదటి సూచకక్రియను వివాహములో ఎందుకు చేసియున్నాడు? వివాహము అనునది దేవుని రాజ్యమునకు సాదృశ్యముగా యున్నది. యేసు అద్భుతము చేసినపుడు ఆ వివాహములో ఎవరు ఉన్నారు? యోహాను 2:1-11 లో వివాహమునకు సంబంధించిన వివరణ ఉన్నది. **“మూడవ దినమున గలిలయలోని కానా అను ఊరిలో ఒక వివాహము జరిగెను. యేసు తల్లి అక్కడ ఉండెను. యేసును ఆయన శిష్యులును ఆ వివాహమునకు పిలువబడిరి''** తల్లి (పెండ్లికుమార్తెకు / క్రొత్త యెరూషలేమునకు /సంఘమునకు సాదృశ్యముగా ఉన్నది . యేసు (గొఱ్ఱెపిల్ల) అక్కడ ఉండెను. ఆయన శిష్యులు (ప్రభువును వారి జీవితములో క్రమశిక్షణకు అనుమతించినవారు) అక్కడ ఉన్నారు. ఆరవ వచనం (ఆరవసంఖ్య మానవునికి సాదృశ్యముగా నున్నది) 6 వ వచనంలో ఈ విధంగా చెప్పబడింది. **''యూదుల శుద్ధీకరణాచార ప్రకారం రెండేసి మూడేసి తూములు పట్టు ఆరు రాతిబానలు అక్కడ ఉంచబడియుండెను”** ఈ ఆరు కాళీ రాతి బానలు దేవుడులేని మానవునికి సాదృశ్యముగా ఉన్నవి. ఈ బానలు రాతితో చేయబడియుండుటను బట్టి అవి మానవుని “రాతిహృదయ” స్థితికి సాదృశ్యముగా ఉన్నవి.

మూడవ వచనంలో “ద్రాక్షరసము అయిపోయనప్పుడు యేసుతల్లి- వారి హృదయములు సిద్ధముగా యున్నవని తల్లి తెలుసుకుని పరలోకపు తండ్రి దృష్టితో వారిని చూచినది. వారి హృదయాలను కాళీ చేసుకొని (క్రొత్త ద్రాక్షారసము) క్రీస్తుచే అంచులమట్టుకు నింపబడుటకు శుద్ధీకరించబడియున్నారు. వారికి ఆయనే సమస్తమైన వాడుగా స్వీకరించుటకు సిద్ధముగా యున్నారు. ‘‘ద్రాక్షారసమైపోయినపుడు ఆమె (తల్లి) యేసుతో చెప్పినది. వారి హృదయములు తిరిగి యేసువైపుకు తిరిగినపుడు మరియు (ఆత్మఫలములతో / నీతిఫలములతో / దేవుని రాజ్యములో పాలిభాగస్తులు కావలెనని) వారికి ద్రాక్షారసము కావలసి వచ్చెను. ఆమె యేసుకు ముఖ్యముగా చెప్పినది ఏమిటంటే “కుమారుడా! సమయము వచ్చినది” 5 వ వచనంలో **“ఆయన తల్లి పరిచారకులను చూచి ఆయన మీతో చెప్పునది చేయుడనెను”** అనగా ఆమె పరిచారకులతో ఆయన ఆజ్ఞను గైకొనుడని చెప్పెను. మత్తయి 23:11 నందు యేసు **“మీలో అందరికంటే గొప్పవాడు మీకు పరిచారకుడై యుండవలెను'' అని చెప్పబడినది.** మార్కు 9:35 నందు **‘‘ఎవడైనను మొదటివాడై యుండగోరిన యెడల వారందరిలో కడపటివాడును, అందరికి పరిచారకుడునై యుండవలెను”** అని చెప్పెను. యేసు శిష్యులతో ‘‘మీలో

అందరికంటే గొప్పవాడై యుండగోరిన యెడల తండ్రి మహిమను మరియు ఆయన సంపూర్ణత్వమును ధరించుకొనవలసి యున్నది. మన పరలోకపు తండ్రి నిన్ను తగిన సమయమున హెచ్చించులాగున నిన్ను నీవు తగ్గించుకొని, నీ ప్రాణమును సమర్పించి, గొఱ్ఱెపిల్లగాను, పరిచారకు నిగాను మార్పు చెందవలెను.

యోహాను 2:5 నందు ఆ తల్లి దేవుని కుమారులందరికి (అప్పుడు మరియు ఇప్పుడు కూడా) చెప్పునదేమనగా **"ఆయన మీతో చెప్పునది చేయుడి''** రోమా 8:14నందు **''దేవుని ఆత్మచేత నడిపించబడేవారందరు దేవుని కుమారులు అనబడుదురు".**

నేను మీతో చెప్పునదేమనగా– ఇప్పుడు సమయము సమీపించినది, తండ్రి మరియొకసారి తల్లియైన సంఘముద్వారా తన కుమారులకు చెప్పునదేమనగా "సమయము సమీపించినది. క్రీస్తు మరలా వచ్చి అద్భుతములుచేసే సమయము వచ్చినది. తండ్రి తన కుమారుల ద్వారా మరలా వచ్చి ఆయన రాజ్యమును మరియు దేవుని మహిమను ప్రపంచమంతయు చూచునట్లు ప్రదర్శించే సమయము వచ్చినది. తల్లివంటి సంఘము ఈ విషయమును గమనించే సమయము వచ్చినదిగాని ఆమె ఆరోహణము కాకమునుపు పరలోకమునకు ఎక్కిపోవాలి. కొన్ని సంవత్సరముల క్రితము బాల్టిమోర్ నుండి వచ్చిన మనుష్యుల గుంపును గూర్చి– వారు క్రీస్తునందు అత్యున్నతస్థితిలో దేవుని కుమారులుగా పట్టబడియున్నారు అనే దర్శనమును పొందియున్నారు. 2థెస్స 4:16 నందు **"క్రీస్తునందు మృతులైనవారు మొదట లేతురు"** నీ ఆత్మలో మరణించిన స్థితిలో నీవు ఉండినట్లయితే ఇప్పుడే ఇది నెరవేరును. "క్రీస్తునందు మృతులు" అనగా తన సిలువను ఎత్తుకొని ఆయనను వెంబడించినవారు, స్వచిత్తమునకు మరణించినవారు, మొదటిభర్తను సమాధి చేసినవారు మరియు క్రీస్తులో ఏకత్వమును కలిగినవారు మొదట లేతురు. అటువంటి ప్రదేశములోనికి క్రీస్తు మనలను నెట్టుచున్నాడు. నేను చెప్పునది మీకు అర్థమగుచున్నదా? 1థెస్స 4:17 నందు **"మనము సదాకాలము ప్రభువుతో కూడా ఉందుము.** 1కొరింథి 15:49 **''మనము నిద్రించవుగాని ఒక్కరెప్పపాటున మార్పు చెందుదుము ఆ మీదట సజీవులమై యుండు మనము వారితో కూడా ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండలమునకు మేఘములమీద కొనిపోబడుదుము.** హెబ్రి 12:1 **''గొప్ప సాక్షి సమూహము మేఘమువలె మనలను ఆవరించుటను గూర్చి చెప్పబడుచున్నది;** హెబ్రి 12:23 నందు **"సంపూర్ణస్థితి పొందిన నీతిమంతుల ఆత్మలు"** అని వ్రాయబడినది. ఇక్కడ దేవుని కుమారులు (ఇక్కడను, అక్కడను జయించినవారు) ఒకరినొకరు వివాహము చేసుకొనుట ద్వారా క్రీస్తులో సంపూర్ణమైన యేకత్వమును కలిగియుందురు. సృష్టి అంతయు (దేవుని కుమారులతో సహా) దృశ్యమైనవి మరియు అదృశ్యమైనవి దేవుని కుమారుల ప్రత్యక్షత కొరకు మూలుగుచున్నది. ఇంత గొప్ప సాక్షి సమూహము మేఘమువలె మనముందు వెళ్ళుచున్నప్పుడు మనమందరము క్రీసులో సంపూర్ణమైన స్థానమును పొందుటకు కనిపెట్టుచున్నాము. హెబ్రి 11:39,40 మరియు హెబ్రి 12:1,2 ఈవిధముగా చెప్పబడుచున్నది– **ఇంత గొప్ప సాక్షిసమూహము మేఘమువలె మనలను ఆవరించి యున్నందున మనము కూడా ప్రతిభారమును, సులువుగా చిక్కులపెట్టు పాపమును విడిచిపెట్టి, మన యెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరిగెత్తుదము.** (ఇదీ మనము అనుసరించవలసిన మాదిరి) **ఆయన తన ఎదుట ఉంచబడిన ఆనందము కొరకై అవమానమును నిర్లక్ష్యపెట్టి సిలువను సహించి దేవుని సింహాసనము యొక్క కుడిపార్శ్వమున ఆసీనుడైయున్నాడు".**

దేవుడు ఇచ్చిన దర్శనములో దేవుని కుమారులు మొదట లేతురు. తరువాత మేము ఎన్నడు చూడని గొప్ప సుడిగాలి వీచుటను మేము చూచితిమి. తరువాత సంఘము ఒక అందమైన వజ్రమువలె ఉండి దానిలో కొంతభాగము భూమిలో కప్పబడియుం డుటను చూశాము. తరువాత మేము చూచిన సుడిగాలి (అది దేవుని వాక్యము మరియు ఆత్మ) క్రీస్తు శరీరమునందును మరియు సంఘమునందును ఉన్న ప్రతివిధమైన మలినమును ఈడ్చుకొనిపోయెను. ఈ సుడిగాలి ప్రతివిధమైన కళంకమును పారద్రోలుచున్నపుడు సంఘము ఆత్మలోకమునకు ఎక్కుటను చూచియు న్నాము. మరియు చివరిగా గొఱ్ఱెపిల్లకు వివాహము చేయుటను చూచియున్నాము. దేవునితో ఏకత్వమును పొందుటకు ఒక క్రమబద్ధమైన ప్రణాళికను దేవుడు అనుసరించుచున్నాడు అని గమనించవలెను. యోహాను 2 వ అధ్యాయానికి తిరిగి వెళ్ళినట్లయితే 7 నుండి 10 వచనాల వరకు యేసు తన శిష్యులతో ఈవిధముగా చెప్పుచున్నాడు– **"రాతి బానలను నీళ్ళతో నింపుడి"** (నీరు వాక్యమునకు మరియు ఆత్మకు సాదృశ్యముగా యున్నది. **వారు అంచులమట్టుకు వాటిని నింపిరి. అప్పుడాయన వారితో మీరిప్పుడు ముంచి విందు ప్రధాని యొద్దకు తీసుకొనిపొం డని చెప్పగా, వారు తీసుకొనిపోయిరి. ఆ ద్రాక్షారసము ఎక్కడి నుండి వచ్చెనో ఆ నీళ్ళు ముంచి తీసుకొనిపోయిన**

**పరిచారకులకే తెలిసినది గాని విందు ప్రధానికి తెలియకపోయెను. గనుక ద్రాక్షారసమైన ఆ నీళ్ళు రుచి చూచినపుడు ఆ విందు ప్రధాని పెండ్లికుమారుని పిలిచి జనులు మత్తుగా ఉన్నప్పుడు జబ్బురసము పోయుదురు. నీవైతే ఇదివరకు మంచి ద్రాక్షారసము ఉంచుకొనియున్నావని అతనితో చెప్పెను.** అనగా మంచిదానిని చివరివరకు దాచియున్నావని విందు ప్రధాని పెండ్లికుమారునితో చెప్పెను. విందు ప్రధాని తనకు తెలియకూడని ఈ సృష్టి అంతయు పాలుపొందుటకు ఎదురుచూచే క్రొత్త ద్రాక్షారసమును గూర్చి మాట్లాడుచున్నాడు. ఈ సృష్టి అంతయు క్రొత్త ద్రాక్షారసమును (దేవుని కుమారుల ప్రత్యక్షతను) గూర్చి ఎదురుచూచుటకు గల కారణం ఎప్పుడైతే నీరు (వాక్యము మరియు ఆత్మ) నీ మనస్సును సంపూర్తిగా మార్పు చెందించునో అప్పుడు నీవు దేవుని మహిమను (స్వభావమును) ప్రతి సమయంలోను ప్రత్యక్షపరచుట ద్వారా కుమారులందరు విడిపింపబడుదురు. కుమారులులేచి గొఱ్ఱెపిల్లలో పాలిభాగస్తులుగా ఉండినపుడు వారిలోనున్న క్రీస్తు ఈ సృష్టిని విడిపించి ఆరోహణమై గొఱ్ఱెపిల్లను వివాహము చేసుకొనును. గొఱ్ఱెపిల్ల వివాహ విందునకు పిలువబడిన వారందరు ధన్యులు అని వ్రాయబడియున్నది. అందరు వచ్చి ఆయన రాజ్యములో నున్న ఐశ్వర్యమును అనుభవించాలని పెండ్లికుమారుడు మంచివాటిని చివరి వరకు దాచిపెట్టి ఉంచాడు.

ఎప్పుడైతే నీవు సంపూర్తిగా ఆయనతో ఉన్నతలోకములోనికి వచ్చియుంటావో అప్పుడు క్రీస్తు ముందు ఉంచబడినటువంటి ఆనందములోనికి నీవును ప్రవేశించెదవు అని ప్రభువు చాలాకాలం క్రితము చెప్పియున్నాడు. యేసు పొందిన ఆనందం అనేది క్రొత్త ద్రాక్షారసము. అది పొంగి భూమియందంతను పారియున్నది. క్రొత్త ద్రాక్షారసము అనేది భూమిమీద బయలుపరచబడిన దేవునిరాజ్య సంపూర్ణతయునై యున్నది. అటువంటి రాజ్యములో దేవుని నీతి సమాధానము మరియు ఆనందమును నిత్యము అనుభవించుటయేగాని ఒక దినం సంతోషం మరొకదినం లేకపోవుట అనేది ఎన్నటికిని ఉండదు. అటువంటి సమయం ఆసన్నమైనదని ప్రతివారికి గ్రహింపు కలుగుచున్నది. క్రైస్తవ సంఘములలో కూడా చాలామంది అటువంటి సమయము వచ్చినదని చెప్పుచున్నారు. ఇక్కడ ఆత్మలో వధింపబడినవారిని గూర్చి మరియు అక్కడ పరిశుద్ధాత్మలో నవ్వుచున్నవారిని గూర్చి వారు వినుచున్నారు. గనుక వారు ఆలోచించుకొనుచు మరియు బిగ్గరగా మాట్లాడుకొనుచు ఇది పరిశుద్ధాత్మ కార్యము అని ఇటు అటు పరిగెత్తుచున్నారు గాని నేను మీకు చెప్పునదేమనగా వారు చెప్పినది అసలైన అనుభవము కాదుగాని నిజమైన దానియొక్క ఉపోద్ఘాతము మాత్రవే. ఎందుకంటే అసలైనదానిని దేవుడు చివరి వరకూ దాచియుంచినాడు. హెబ్రీ 11:40నందు మనము లేకుండా సంపూర్ణులు కాకుండునిమిత్తం దేవుడు మనకొరకు మరి శ్రేష్టమైనదానిని ముందుగా సిద్ధపరచెను గనుక వీరు వాగ్ధానఫలము అనుభవింపలేదు.

ఎందుకంటే ఆయన శ్రేష్టమైనవాటిని చివరివరకు భద్రపరచినాడు. ఎప్పుడైతే ఆ శ్రేష్టమైనవి బయలుపరచబడియున్నవో అది చిరకాలము నిలిచేది. ఈ సృష్టి అంతయు దేవుడు ఏర్పరచినదానిని మనము పొందుట కొరకు వేచియున్నది కారణం మనం దానిని పొందుట ప్రారంభించినపుడు క్రైస్తవ సంఘము మరియు సృష్టి అంతయు దాని ద్వారా వచ్చే సంతోషములో పాలిభాగస్తులు అగుదురు. యెహాను 2:11 వచనం నందు గలిలయలోని కానాలో యేసు ఈ మొదటిసూచక క్రియను చేసి తన మహిమను బయలుపరచెను. ఇదియే గొఱ్ఱెపిల్ల వివాహోత్సవము. వివాహములో నుండి ఏకత్వము ద్వారా తన మహిమను భూమియంతటను ప్రచురము చేయటయే దీని ఉద్దేశ్యము. ఈ భూసంబంధమైన వివాహములో ఒక పురుషుడు, స్త్రీ వివాహ బంధము ద్వారా ఏకశరీరమైనపుడు తమవంటి మరియొక వ్యక్తినివారు సృష్టించి ఆ సంతానములో వారి రూపమును చూచుకొనెదరు. అలాగుననే దేవుడు తన కుమారుని కొరకు వివాహమును ఏర్పరచి వారి కలయిక ద్వారా మరియొక వ్యక్తిని (కుమారుని లేక క్రీస్తుని) నీ నుండి సృష్టించి దాని ద్వారా తన మహిమను భూమియందంటను ప్రత్యక్షపరచుట మరియు ప్రచురము చేయుట ఆయన ఉద్ధేశ్యము. మత్తయి 22:2,3. నందు **పరలోక రాజ్యము తన కుమారునికి పెండ్లివిందు చేసిన ఒక రాజును పోలియున్నది. ఆ పెండ్లివిందుకు పిలువబడినవారిని రప్పించుటకు అతడు తన దాసులను పంపినపుడు వారు రానొల్లకపోయిరి.** ఈ వివాహమునకు మిమ్మును ఆహ్వానించుటకు దేవుడు ఎన్నిసార్లు తన సేవకులను తన ప్రతినిధులుగా మీవద్దకు పంపించి యున్నాడు? నీవు ఎన్నిసార్లు ఇతరులను "వచ్చేవారం రావచ్చులే, వారికి నీతో పని ఏమీ లేదు" అనే విత్తనం నాటుట వలన వారు దేవుని యొద్దకు రాలేకపోయిరి. నాల్గవవచనంలో ఈవిధంగా చెప్పబడినది. **"కాగా అతడు ఇదిగో నా విందు సిద్ధపరచియున్నాను. ఎద్దులును, క్రొవ్విన పశువులును వధింపబడినవి. అంతయు సిద్ధముగా యున్నది. పెండ్లివిందుకు రండని**

**పిలువబడినవారితో చెప్పుడని వేరే దాసులను పంపెను.** అక్కడ ప్రతి పదార్ధమును సిద్ధపరచి చాలా సమయమైనది. యేసు సిలువపై చనిపోయినపుడు అంతయు సిద్ధమై యున్నది. ఆయన రాజ్యమును విడుదల చేసియున్నాడు. ఆయన క్రొత్తనిబంధనను విడుదల చేసియున్నాడు. ఆయన జీవిత ధర్మశాస్త్రమును విడుదల చేసియున్నాడు. నా కుమారుని కొరకు ఏర్పాటు చేసిన వివాహమునకు వచ్చి నా రాజ్యములోను సంతోషములోను పాలుపొందుడని తండ్రి సమస్తమైన వారిని ఆహ్వానించుచున్నాడు. కాని 5,6 వచనములో **''వారు లక్ష్యముచేయక ఒకడు తన పొలమునకు మరియొకడు తన వర్తకమునకు వెళ్ళిరి. తక్కినవారు అతని దాసులను పట్టుకొని అవమానపరచి చంపిరి. కాబట్టి రాజు కోపపడి తన దండ్లను పంపి ఆ నరహంతకులను నంహారించి, వారి పట్టణము తగులపెట్టించెను.**

సాకులు తర్వాత సాకులు చెప్తూ ఉంటారు. ఎన్నిసార్లు మనుష్యులు నీ జీవితము మరియు క్రీస్తుతో నీకు వివాహములో ఉన్న ఆనందమును చూచి "వారు వెనుకకు తిరిగి ఇది నాకు అక్కరలేదని చెప్పారు?" వారు అక్కరలేదు అనుటకు కారణం దానికి మూల్యము చెల్లించుటకు సిద్ధముగా లేరు. వారు గొఱ్ఱెపిల్ల వివాహమునకు వచ్చుటకు నిరాకరించుటకు గల కారణం వారి జీవితము అర్పించవలసి ఉండును. వారి మనస్సును వారు పట్టుకొని ఉండలేక (ఈలోక జీవితమును, శరీర ఆశల ప్రకారం జీవించుటకు) ఇదంతయు అశాశ్వతమని దానిని విడిచిపెట్టవలసిన అవసరత ఉన్నదని గ్రహించకయున్నారు. ఆ కారణం చేత మత్తయి 16:24,25 నందు **"ఎవడైనను నన్ను వెంబడింపగోరిన యెడల అతడు తన్నుతాను ఉపేక్షించుకొని (అతని మనస్సును / స్వచిత్తమును / శరీర ఆశలను / భర్తను) తన సిలువనెత్తుకొని (మృతునిగా పరిగణించుకొని) నన్ను వెంబడింపవలెను.** (నా మదిని అనుసరించవలెను) నాయొద్దకు వచ్చి నాతో ఏకత్వమును కలిగియుండవలెను. గొఱ్ఱెపిల్ల వివాహమునకు వచ్చి నన్ను వివాహము చేసుకొనవలెను. తన ప్రాణమును ఈలోకంలో కాపాడుకొనగోరువాడు దానిని పోగొట్టుకొనును. మరియు నా నామము నిమిత్తము తన ప్రాణమును పోగొట్టుకొనువాడు (దేవుని రాజ్యములో / క్రీస్తులో) దానిని రక్షించుకొనును. మత్తయి 22:8-10 నందు ఈలాగు వ్రాయబడినది- **అప్పుడతడు పెండ్లివిందు సిద్ధముగా ఉన్నదిగాని పిలువబడినవారు పాత్రులు కారు గనుక రాజమార్గములకు పోయి నీకు కనబడువారందరిని పెండ్లివిందుకు పిలువుడని తన దానులతో చెప్పెను.** (ఇచ్చుయించువానిని రానిమ్ము) **గనుక ఆ దాసులు రాజమార్గములకు పోయి చెడ్డవారినేమి మంచివారినేమి తనకు కనబడినవారినందరిని ప్రోగుచేసిరి. గనుక విందుకు వచ్చినవారితో ఆ పెండ్లిశాల నిండెను.** ఆ దాసులు రాజమార్గమునకు పోయి మంచివారినేమి, చెడ్డవారినేమి తమకు కనబడినవారినందరిని ప్రోగుచేసిరి అని వ్రాయబడినది. నీవు గతజీవితములో ఏమి చేసియున్నావు అనేది ప్రభువునకు అవసరము లేదుగాని ప్రస్తుతము నిన్ను నీవు రిక్తునిగా చేసుకొని ఆయనను వెంబడింపవలెనని ఆయన కోరుచున్నాడు. మరియు నీ హృదయమును ప్రభువువైపునకు త్రిప్పి ఆయనతో వివాహము ద్వారా ఒక ఒడంబడిక చేసుకొనవలెనని ఆయన కోరుచున్నాడు. ఆయన నీ పాపములను చూచుటలేదుగాని ఆయనతో సమాధానపరచబడిన సంపూర్ణమైన ఆనందముగల వ్యక్తిగా నిన్ను చూచుచున్నాడు.

11వ వచనంలో ఈవిధంగా చెప్పబడినది. **రాజు కూర్చున్నవారిని చూడలోపలికి వచ్చి అక్కడ పెండ్లి వస్త్రము ధరించుకొనని ఒకనిచూచెను.** ఈవ్యక్తి ఇశ్రాయేలీయులకు ప్రతినిధిగా ఉన్నాడు. ఈ భూమిమీద ఇశ్రాయేలీయులు (ఆదామువలె) దేవుని కుమారులుగా ఉండుటకు పిలువబడియున్నారు గాని వారు దేవుని ద్వేషించి ఈ భూమిపై వారి స్వంత నీతిని మరియు స్వంతరాజ్యమును వెదకుకొనిరి. వారిని ఐగుప్తు (ఈలోకము మరియు శరీరము) బానిసత్వము నుండి విడిపించుటకు దేవుడు తన సేవకుడైన మోషేను విడిపించేవానిగా వారియొద్దకు పంపినపుడు నిర్గమ 4:22,23 నందు ఈవిధముగా చెప్పబడినది- **"అప్పుడు నీవు ఫరోతో ఇశ్రాయేలు నా కుమారుడు. నా జ్యేష్టపుత్రుడు. నన్ను సేవించుట్లు నా కుమారుని పోనిమ్మని నీకు ఆజ్ఞాపించుచున్నాను.** దేవుడు ఇశ్రాయేలీయులను తన కుమారునిగా ఉండుటకు పిలువబడినప్పటికిని తరువాత ఇశ్రాయేలు తృణీకరిపంబడినది. మరియు మత్తయి 22:12-14 నందు పెండ్లివస్త్రము ధరించుకొనని ఒకనిచూచి స్నేహితుడా అని పిలుచుచున్నాడు. స్నేహితుడా అని పిలవడం గమనించండి. యోహాను 15:15 వచనం నందు **యేసు తన శిష్యులతో మాట్లాడుచూ నేను మిమ్ములను స్నేహితులని పిలచుచున్నాను. ఎందుకనగా నేను నా తండ్రివలన వినిన**

**సంగతులన్నిటిని మీకు తెలియజేసితిని.** దేవుడు తన సేవకులను (ప్రవక్తలను) ఇశ్రాయేలీయులకు ప్రవచించుటకు పంపియున్నాడు. ప్రవక్తలు తండ్రి నుండి వినిన సంగతులన్నియు ఇశ్రాయేలీయులకు తెలియజేసారు. అయినప్పటికి వారు అనేకసార్లు దేవునిని తృణీకరించారు. ధర్మశాస్త్రమును మరియు ప్రవక్తల గ్రంథమును ఎరిగియు మొదటి నుండి చివరి వరకు ఉన్న గ్రంథములు యేసును సూచిస్తూ ఉండినను ధర్మశాస్త్రము ద్వారా తమ స్వనీతిని ఏర్పరచుటకు ప్రయత్నముచేసి దైవవాక్యమును తృణీకరించారు. స్నేహితుడా అని పిలుచుట ద్వారా అతని హృదయములో దిద్దుబాటును మరియు నిశ్చయతను కలిగిస్తుంది. ఇశ్రాయేలీయులకు ధర్మశాస్త్రమును మరియు ప్రవక్తల గ్రంథమును తెలియునని దేవుడు ఎరిగియున్నాడు. యోహాను 15:14 లో యేసు ఈ విధంగా చెప్పుచున్నాడు. **నేను మీకు ఆజ్ఞాపించినవాటిని చేసిన యెడల మీరు నా స్నేహితులై యుందురు అని చెప్పియున్నాడు.** దేవుని వాక్యమును ఎరిగియున్నంత మాత్రమున సరిపోదు. ఆయన యేమి చెప్పుచున్నాడో అది చేయగలగాలి. ఆయనతో ఐక్యముగా ఉండుట ద్వారా ఆయనలో నడిచే బాధ్యత వచ్చును. దేవుడు అనేకసార్లు ఇశ్రాయేలీయులను దిద్దుబాటు చేస్తూ వెనుకకు తిరిగిరమ్మని వారిని వేడుకొన్నప్పటికి వారు ఆయనను తృణీకరించిరి. వారు మొండివారుగాను, తిరుగుబాటు చేసేవారుగాను అనేకసార్లు ఆయనను విసిగించిరి. ఆయన ఆజ్ఞలను వారు నెరవేర్చలేదు. మరియు ఆయన యొద్దకు వారు తిరిగి రాలేరు. వారు తమ స్వమార్గము లయందు నడిచిరి. కావున రాజు ఈ వ్యక్తితో (ఇశ్రాయేలుతో) ఇలాగు చెప్పుచున్నాడు. పెండ్లివస్త్రము లేక ఇక్కడకు ఏలాగు వచ్చితివని అడుగగా వాడు మౌనియై యుండెను. అతడు మౌనముగా ఉండుటకు గల కారణం పెండ్లివస్త్రము (నూతనవ్యక్తి / క్రీస్తు) ధరించుకొనకుండా వివాహమునకు వచ్చుట. ఇశ్రాయేలు తన స్వంత నీతిని (మురికిగుడ్డలు) ధరించుకొని తన స్వంత ఆహారమును తినుటకు తన స్వంత వస్త్రమును ధరించుకొని వచ్చినది. సంఘము మరియు చాలామంది దేవుని కుమారులు తమ స్వంత నీతిని తొడిగి అనగా మోషే ధర్మశాస్త్రమును బట్టి క్రియలు ద్వారాను, క్రీస్తును ధరించుకొనకుండా వచ్చుటకు ప్రయత్నిం చుచున్నారు. నేను ఇక్కడ చెప్పబోయేది మీకు అర్థం అగుచున్నదా?

**"అంతట రాజు వాని కాళ్ళుచేతులు కట్టి వెలుపటి చీకటిలోనికి త్రోసివేయుడి. అక్కడ ఏడ్పును, పండ్లుకొరుకుటయు ఉండునని పరిచారకులతో చెప్పెను.** ఆయనతో జరుగు వివాహము ద్వారా ఆయన కుమారులుగాను, మరియు ఆయన స్వభావమును ధరించుకొనుటకు **చాలామంది పిలువబడిరి**(గొఱ్ఱెపిల్లతో వివాహము ద్వారా ఆయనను ధరించి, ఆయన స్వభావమును కలిగియుండుటకు) **గాని బహుకొద్దిమంది** (రాజును సంతోషపరిచే నిజమైన నమ్మకమైన కన్యనుగాను) ఏర్పరచబడిరి. గాని పౌలు రోమా 10:1,2 వచనములయందు **సహోదరులారా! ఇశ్రాయేలు రక్షణపొం దవలెనని నా హృదయాభిలాషయు, వారి విషయమై నేను దేవునికి చేయు ప్రార్ధనయునై యున్నవి. వారు దేవునియందు ఆశక్తిగలవారని వారిని గూర్చి సాక్ష్యమిచ్చుచున్నాను. అయినను వారి ఆశక్తి జ్ఞానానుసారమైనది కాదు. ఏలయనగా వారు దేవుని నీతినెరుగక** (కృప ద్వారానే మనము రక్షింపబ డియున్నాము గాని నా వలన కలిగినది కాదు. క్రియలవలన కాదు. అది దేవుని కృపావరమే కనుక ఏ మనుష్యుడును గర్వించకూడదు అనే విషయము వారు అర్థం చేసుకోలేకపోయారు) **తమ స్వనీతిని స్థాపింపబూనుకొనుచు దేవుని నీతికి లోబడలేదు.** ఈ కారణముచేత ఈ వ్యక్తి (ఇశ్రాయేలు) వెలుపలి చీకటిలోనికి త్రోసివేయబడ్డాడు.

అన్యులు యేసు యొద్దకు రావాలంటే ఇశ్రాయేలు వెలుపలి చీకటిలోనికి గెంటివేయబడాలి. ఈ అధ్యాయమునంతా నీవు చదువు కొనవచ్చును గాని రోమా 11వ అధ్యాయమునందు (దీనిలో ఇప్పటికే కొన్ని విషయములను అధ్యయనము చేసియున్నాము) ఉన్న కొన్ని సత్యములను గూర్చి కొంచెం వివరంగా ధ్యానించుటకు ఆశపడుచున్నాను. 7,8 వచనములు "అలాగైన ఏమగును? **ఇశ్రాయేలు వెదుకునది ఏదో అది వారికి దొరకలేదు. ఏర్పాటు నొందినవారికి అది దొరికెను. అక్కడ వారు కఠినచిత్తులైరి. ఇందు విషయమై నేటివరకు దేవుడు వారికి నిద్రమత్తుగల మనస్సును చూడలేని కనులను వినలేని చెవులను ఇచ్చియున్నాడని వ్రాయబడియున్నది** 11వ వచనంలో **కాబట్టి నేనడుగునది ఏమనగా వారు పడిపోవునట్లుగా తొట్రిల్లిరా? అట్లనరాదు. వారికి రోషము పుట్టించుటకై వారి తొట్రుపాటు వలన అన్యజనులకు రక్షణ కలిగెను.** వారి తొట్రుపాటు వలన అన్యజనులకు రక్షణ కలిగెను అని వ్రాయబడియున్నది. దేవుడు తన ప్రణాళికలో ఆదాము పడిపోవుటకు ఒక కారణమున్నది. మరియు ఇశ్రాయేలీయులు పడిపోవుటకు కూడా ఒక కారణమున్నది. దాని ద్వారా దేవుడు ఈ ప్రపంచ మొత్తమును వివాహము చేసుకొనుట ద్వారా తనవంటి వ్యక్తిని ఈ

భూమియందంతటను సృష్టించుటకు అనుకూలమగును. ఆ కారణముచేత ఈ సృష్టిఅంతయు గొఱ్ఱెపిల్ల వివాహమునకు వచ్చి ఆయనతో మరల ఏకము కావలెను. అలాగే ఇశ్రాయేలు కూడా ఆయనను మరల వివాహము చేసుకొనవలెనని ఆయన చిత్తము.

12వ వచనంలో ఈవిధంగా చెప్పబడినది. **వారి తొట్రుపాటు వలన లోకమునకు ఐశ్వర్యము కలిగెను.** (వారు దేనికి పడిపోయిరో అదే ఈలోకమునకు ఐశ్వర్యము. **వారి క్షీణదశ అన్యజనులకు ఐశ్వర్యమును అయినయెడల వారి పరిపూర్ణత ఎంత ఎక్కువగా ఐశ్వర్యమగును?** తరువాత 15వ వచనంలో వారిని (ఇశ్రాయేలును) విసర్జించుట లోకమునకు దేవునితో సమాధానపరచుట అయిన యెడల వారిని చేర్చుకొనుట ఏమగును? మృతులు సజీవులైనట్టే అగునుగదా? దేవుని ప్రణాళికలో ఇశ్రాయేలు పడిపోవుట మరియు ద్వేషించబడుట యున్నది. వారు రాజును ద్వేషించి వివాహమునకు రాకపోవుటకు కారణం దేవుడు వారికి నిద్ర మత్తుగల ఆత్మను ఇచ్చియున్నాడు. ఆయన వారికి ఈదినము వరకు చూడలేని కన్నులను, వినలేని చెవులను ఇచ్చియున్నాడు కావున వారు చేసినది ఏమిటో ఇప్పటికి కూడా వారికి అర్థం కాలేదు. మరియు తెలివి తక్కువతనము (చీకటియందు) సత్యము పట్ల గ్రుడ్డితనములో పడిపోయిరి. ఈ భూమిమీద దేవుడు మొదటి ఒడంబడిక చేసుకొనబడిన ప్రజలు ఇశ్రాయేలీయులు. కాని దేవుడు ఈ ఒడంబడికను మిగిలిన ప్రపంచమంతటికిని వర్తింపచేయుటకు తీర్మానించుకున్నాడు. కావున వారి పతనము ద్వారా రక్షణ అన్యజనులకు వచ్చినది. 25 మరియు 26 వచనములలో **సహోదరులారా మీ దృష్టికి మీరే బుద్ధిమంతులమని అనుకొన కుండునట్లు ఈ మర్మము మీరు తెలుసుకొనగోరుచున్నాను. అదేమనగా అన్యజనులకు ప్రవేశము సంపూర్ణమగు వరకు ఇశ్రాయేలునకు కఠినమనస్సుని కొంతవట్టుకు కలిగెను.** అక్కడ సంపూర్ణమగువరకు అని వ్రాయబడియున్నది. అనగా వారి గ్రుడ్డితనము (సత్యమునకు / క్రీస్తు) తాత్కాలికమే మరియు ఒక దినమున వారి కండ్లు తెరువబడి వారు కూడా గొఱ్ఱెపిల్లతో ఏకత్వమును పొందుదురు. ఈ విధముగా ఇశ్రాయేలీయులందరు రక్షింపబడుదురు. 23వ వచనంలో దేవుడు మరల అంటుకట్టుటకు శక్తిగలవాడు అని ఉంది. అరణ్యములో చనిపోయినవారు సైతం అంటుకట్టబడుదురు. ఒకవ్యక్తి చనిపోయిన తరువాత వారికి ఏవిధమైన గురి ఉండదని మతము మనకు బోధించును. ఒకవేళ అది సత్యమైతే దేవుడు మరల అంటుకట్టును అని ఎందుకు వ్రాయబడియున్నది? **"....ఇశ్రాయేలీయులందరు రక్షింపబడుదురు** అని వ్రాయబడియున్నది. వారిలో కొద్దిమంది మాత్రమే అని గాని ఇక్కడ ఉన్నవారు మాత్రమే అని గాని లేక అక్కడ జీవించియున్నవారు అని వ్రాయబడలేదు. ఇశ్రాయేలీయులందరు రక్షింపబడుదురు అని వ్రాయబడియున్నది. కొలస్సీ 1:20 నందు **ఆయన సిలువ రక్తముచేత సంధిచేసి ఆయన ద్వారా సమస్తమును అవి భూలోకమందున్నవైనను** (దృశ్యరూపములో ఉన్నవి / సహజశరీరములో ఉన్నవి) **పరలోకసంబంధమైనవిగాని** (అదృశ్యలోకములోనివి ఆత్మసంబంధమైనవి సమాధి ద్వారా వెళ్ళినవి) **వాటినన్నిటిని ఆయన ద్వారా తనతో సమాధానపరచుకొనవలెనని తండ్రి అభీష్టమాయెను.** 1పేతురు 3:18-20 నందు యేసు సిలువకు వెళ్ళినతరువాత ఆయన మొదట చేసినపని ఏమిటంటే నోవహు దినములలో జలప్రళయమునందు చనిపోయినవారికి సువార్త ప్రకటించుటకు వెళ్ళెను అని వ్రాయబడి యున్నది. వాక్యములో ఈవిధముగా ఉన్నది- **ఏలయనగా మనలను దేవుని యొద్దకు తెచ్చుటకు అనీతిమంతుల కొరకు నీతిమంతుడైన క్రీస్తు శరీరవిషయములో చంపబడియు ఆత్మవిషయములో బ్రతికింపబడి పాపముల విషయములో ఒక్కసారే శ్రమపడెను. దేవుని దీర్ఘశాంతము ఇంకా కనిపెట్టుచుండినప్పుడు పూర్వము నోవహు దినములలో ఓడ సిద్ధపరచబడుచుండగా అవిధేయులైనవారి యొద్దకు అనగా చెరలో ఉన్న ఆత్మలయొద్దకు ఆయన ఆత్మరూపిగానే వెళ్ళి వారికి ప్రకటించెను. ఆ ఓడలో కొందరు అనగా ఎనిమిదిమంది నీటిద్వారా రక్షణ పొందిరి.** ఈ సృష్టి అంతటిని దేవుడు తన యొద్దకు తెచ్చుకొని ఆయనతో సమాధానపరచుకొనుటకు గొఱ్ఱెపిల్ల వధింపబడినది. క్రీస్తు బలి ఖచ్చితమైనది. మరియు ఆయన ఎవ్వరిని బయట వదిలిపెట్టలేదు. మతబోధ వేరేవిధముగా ఉండినను దేవుడు రక్షించుటకు సమర్థుడు. రోమా 11:26 లో ఈవిధంగా వ్రాయబడింది. **వారు ప్రవేశించినపుడు విమోచకుడు సియోనులో నుండి వచ్చి యాకోబులో నుండి భక్తిహీనతను తొలగించును. నేను వారి పాపములను పరిహరించినపుడు నా వలన వారికి కలుగు నిబంధన ఇదియే అని వ్రాయబడినట్లు ఇశ్రాయేలు జనులందరు రక్షింపబడుదురు.** దేవుడు ఇశ్రాయేలును రక్షించును. దేవుడు ఆమె కండ్లను మరల

తెరువజేసి తనలో నుండి నిద్రపుచ్చు ఆత్మను తీసివేయును. దేవుడు దీనిని చేసినపుడు ఇశ్రాయేలీయులందరు తిరిగి వారి భర్త యొద్దకు వచ్చెదరు. దేవుని తృణీకరించే అనేకమంది యున్నారు. వారికి దేవునితో ఏకత్వమును కలిగియుండుట ఇష్టములేదు. దేవునితో వారు పొందగలిగిన సంబంధము నుండి పారిపోవుచున్నారు. నిజముగా వారు ఎదురుచూచే సత్యమునకు చూడలేని గ్రుడ్డితనమును కలిగియున్నారు. దేవుని ప్రజలు మరియు ఆయన స్వంత కుమారులు క్రీస్తునకు బయట ఉన్న అనేక సంగతుల వెంబడి పరుగెడుచుండినపుడు దేవుడు వారిని ఒక్కసారే చూచుటకు అనుమతించుచున్నాడు. వారి మనస్సును తిరుగులాడునట్లు ఆయన చేసి వారు ఇతర ప్రేమికులతోను, విగ్రహములతోను వెళ్ళుటలో ఆయన ఒక ఉద్ధేశ్యమును కలిగియున్నాడు. ఆ ఉద్ధేశ్యము ఏమిటో మీకు తెలియునా?

మనము నిజముగా కోరుకునే వ్యక్తులు వారు కాదని మనకు తెలియునట్లు దేవుడు మనలను ఇతర ప్రేమికుల యొద్దకు వెళ్ళుటకు అనుమతించుచున్నాడు. మనము కోరుకునే వాటితో సంబంధమును కలిగియుండుటకు ఇష్టపడుట ద్వారా అవి మనలను ఒక నరకము తరువాత మరియొక నరకమునకు తీసుకొని పోవునని చూపించుటకు దేవుడు ప్రయత్నించుచున్నాడు. క్రీస్తునకు బయట మనము ఎన్నుకొనిన మార్గమునందు ప్రయాణించుట కొనసాగిన యెడల ఈ విషయములన్నియు మన జీవితమును నాశనము చేయును అని తెలియజేయుటకు అనుమతించుచున్నాడు. చివరిగా మనము ప్రభువు యొద్దకు వచ్చి ఆయనతో ఏకత్వమును అనగా గొఱ్ఱెపిల్ల వివాహమునకు అనుమతించుటకు నీవు తీర్మానము చేసుకొనే వరకు ఆయన నిన్ను ఒక నరకము వెంబడి మరియొక నరకమును అనుభవించే వరకు అనుమతించుచున్నాడు. గొఱ్ఱెపిల్ల వివాహము అనేది దేవుని కుమారుల మధ్యను మొదట జరిగే దాని ద్వారా క్రీస్తును ఈ భూమిమీద ఉత్పత్తి చేయుటకు నిర్ణయింపబడినది. ఆయన వెళ్ళే చోటునకెల్లా నీవు ఆయనను వెంబడించునట్లు ఆయనతో నీవు ఒక ఒడంబడికను చేసుకోవాలని ఆయన కోరుచున్నాడు. గొఱ్ఱెపిల్లను వివాహము చేసుకొనుట ద్వారా వచ్చే బాధ్యతను స్వీకరించి దీని భావము ఏమిటో నీవు అర్థం చేసుకోవాలని దేవుడు ఆశించుచున్నాడు.

ఈ కారణముచేత నీ పరలోకము (మనస్సు)లో నున్న ప్రతిదానిని మరియు ఈ భూమిపై నీచుట్టు ఉన్న ప్రతిదానిని కంపింపజేయుచున్నాడు. కారణమేమిటంటే నీవు గొఱ్ఱెపిల్లతో వివాహమునకు మొదటిగా నీ జీవితములో తీర్మానించుకొనినప్పుడు మరియు ఆయనతో ఉండుటకు ప్రవేశించినపుడు నీలో నిలిచియుండేది సర్వశక్తుడైన ప్రభువైన దేవుడు మరియు గొఱ్ఱెపిల్ల మాత్రమే. చివరకు మిగిలియుండేది దేవుని రాజ్యము మాత్రమే. ప్రకటన 22:17వ వచనం నందు యేసు మరియు పెండ్లికుమార్తె (ఆయన సంపూర్ణత్వమును మరియు గొఱ్ఱెపిల్లను ధరించుకొనిన కుమారులు) నిలుచుండి ఈవిధముగా చెప్పుచున్నారు. **ఆత్మయు, పెండ్లికుమార్తెయు రమ్ము అని చెప్పుచున్నారు. వినువారు** (ఆత్మ చెప్పుచున్నది) **రమ్ము అని చెప్పవలెను. దప్పిగొనినవానిని రానిమ్ము. ఇచ్ఛయించువానిని జీవజలమును ఉచితముగా పుచ్చుకొననిమ్ము.** ఒకే స్వరముతో వారందరు చెప్పునదేమనిన **వినువాడు రమ్ము అని చెప్పవలెను.** ఈ విందునకు వచ్చి నాకున్న వీటన్నిటిలోను పాలుపొందని య్యవలెను. **వదార్థములన్నియు సిద్ధముగా ఉన్నవి. గొఱ్ఱెపిల్ల వివాహమునకు వచ్చి నాలో ఏకత్వమును కలిగియుండుడి అని ప్రభువు చెప్పుచున్నాడు.**